RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 06 మే 2026 బుధవారం పేజీలు:12 వెల రూ.2.00 సంపుటి:21 సంచిక:284

## నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటే అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ...రఘురామ్ రాజన్



హైదరాబాద్ నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటే అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ స్పష్టం చేశారు. మానవ వనరుల అభివృద్ధి కోసం పోషకాహార లోపం సమస్యను తగ్గించుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణ భవిష్యత్తు ప్రణాళిక పైన నిర్వహించిన సమావేశంలో రఘురామ్ రాజన్ పలు సూచనలు చేశారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రఘురామ్ రాజన్ తో పాటు డీప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణారావు , సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీల జయేష్ రంజన్, వాణీ ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రభుత్వాల సులభతర వ్యాపార విధానం మీద ఆధారపడి కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయని రఘురామ్ రాజన్ అన్నారు. అయితే స్టార్టప్ లను ఎక్కువ ప్రోత్సహిస్తే మరింత ఉపయోగం ఉంటుందని ఆయన సూచించారు. పాఠశాల,ఉన్నత, సాంకేతిక విద్యతో పాటు వైద్య విద్య సిలబస్ లో ఏఐ ఉపయోగం పైన కమిటీ ఏర్పాటు చేస్తామని, తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రఘురామ్ రాజన్ ను కోరారు. దీంతో పాటు మిడిల్ లెవల్ ఉద్యోగాల కల్పన కోసం స్కిల్స్ యూనివర్సిటీ, ఎటీసీలను అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం ఆయనకు వివరించారు. సరైన పద్ధతిలో ఏఐ ని వినియోగిస్తే అందరికి మేలు జరుగుతుందని ఆర్బీఐ మాజీ గవర్నర్ వ్యాఖ్యానించారు. తమిళనాడు తరహాలో పారిశ్రామిక విధానం ఉంటే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించవచ్చునని ఆయన సూచించారు.డేటా సెంటర్ల కోసం పెద్ద ఎత్తున విద్యుత్, నీటి ఉపయోగం ఉంటుందని రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. మూడు నాలుగు నెలల్లో హైదరాబాద్ పర్యటనకు వస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.



ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతు రాష్ట్రంలో పరిశ్రమల కోసం కావాల్సిన అన్ని సౌకర్యాలు ఉన్నాయని స్పష్టం చేశారు. కావాల్సిన భూమితో పాటు మౌలిక సదుపాయాలు ఉన్నాయని వివరించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు.అంతర్జాతీయ విమానాశ్రయం, అవుటర్ రింగ్ రోడ్డు తో పాటు అనేక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డుల ఏర్పాటుతో పాటు రేడియల్ రోడ్లు, పరిశ్రమల కోసం ప్రత్యేక క్లస్టర్లు తీసుకురాబోతున్నామని ఉప ముఖ్యమంత్రి వివరించారు. శాంతిభద్రతలను పటిష్టంగా నిర్వహిస్తున్నామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి పైన దృష్టి సారించినట్లు తెలిపారు. క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ లో ముందుకు వెళ్తున్నట్లు ఆయన వివరించారు. యువతలో నైపుణ్యాల పెంపు కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ని ఏర్పాటు చేశామన్నారు. ఐటీఐల ను ఏటీసీలుగా మార్చి విద్యార్థులకు నైపుణ్యాలు నేర్పుతున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రా అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 24 గంటలు కష్టపడుతున్నారన్నారు. తెలంగాణ పారిశ్రామికాభివృద్ధి కోసం తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన రఘురామరాజన్ కు కోరారు. సులభతర వ్యాపారానికి అనుగుణంగా తెలంగాణ లో పరిస్థితులు ఉన్నాయని ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఫార్మా, ఐటీ, డేటా సెంటర్ల కోసం కావాల్సిన మంచి వాతావరణం, వసతులు కల్పిస్తున్నట్లు ఆయన రఘురామ్ రాజన్ కు వివరించారు.

## ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి: ప్రధాని మోడీకి భట్టి విక్రమార్క విజ్ఞప్తి



పోలవరంకు జాతీయ హోద ఇచ్చి, తెలంగాణలో ఏ ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోద కల్పించకపోవడం వివక్షతనే...
రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం, నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమేపంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్‌లకు సరఫరా చేసి రైతులు అదనపు ఆదాయం పొందాలి.

మిగతా 2లో

## గడ్డం ప్రసాద్ కుమార్ ను కలిసిన డీజీపీ సీ.వి.ఆనంద్





తెలంగాణ నూతన డీజీపీగా బాధ్యతలు తీసుకున్న సి.వి ఆనంద్ మర్యాదపూర్వకంగా తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ను కలిశారు

**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి మే 5(ప్రజాబలం)** వికారాబాద్ జిల్లా: వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ గారిని అధికారికంగా తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఇ‌న్‌ఛా) గా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్

ఈ సందర్భంగా నూతన డీజీపీ సీవీ ఆనంద్ గారికి శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణస్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్ సంతోషం వ్యక్తపరిచారు

## కాళేశ్వరం అవినీతి పై CBI మౌనం బీజేపి-బీఆర్ఎస్ లాలూచికి నిదర్శనం: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.




వార్తా 2 లో




### ఏరోస్పేస్ దిగ్గజాలకు వ్యూహాత్మక భాగస్వామిగా తెలంగాణ

వార్తా 3 లో

## ప్రధాని పర్యటన పై సమీక్ష



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్ , మే 05 :: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మే 10వ తేదీన తెలంగాణలో పర్యటించనున్న నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి పర్యటనకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను ఆయన సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.



ఈ పర్యటనలో ప్రధానమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. దీంతో పాటు అదేరోజు బహిరంగసభలో పాల్గొననున్నారు. అందుకు అనుగుణంగా బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు ప్రధాన కార్యదర్శి సూచించారు. బేగం పేట్ విమానాశ్రయం, హెలిప్యాడ్‌లతో పాటు అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయాలని ఫైర్ సర్వీసెస్ శాఖ అధికారులను, అవసరమైన వైద్య సదుపాయాలు కూడా ఏర్పాటు చేయాలని, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి కాన్వాయ్ పర్యటించే మార్గాలలో రోడ్లను పరిశీలించాలని ఏ వైన మరమ్మత్తులు ఉంటే యుద్ధప్రాతిపధికన పూర్తి చేయాలని పోలీసు, GHMC, రోడ్లూ భవణాల శాఖల అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటించే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, ప్రధానమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా చూడాలని సూచించారు.

ఈ సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్, స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ , నవీన్ మిట్టల్, దానకిషోర్, వాణిప్రసాద్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, ఇంటిలిజెన్స్ అడిషనల్ డిజి అనిల్ కుమార్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్లు విసి సజ్జనార్, రమేష్ , సుమతి, ఫైర్ సర్వీసెస్ డీజీ, విక్రమ్ సింగ్ మన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి, హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో సిబిఐ విచారణ చేపడుతారా

### గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.







**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** ఈనెల 10వ తేదీన ప్రధాని మోదీ హైదరాబాద్ కి వస్తున్నారు.

మోడీ హైదరాబాద్ వచ్చే లోపు కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో సిబిఐ విచారణ చేపడుతారా లేదా చెప్పాలి..

బండి సంజయ్ కేంద్ర మంత్రి అనే విషయం మర్చిపోయి మాట్లాడుతున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్ లో వేల కోట్ల అవినీతి జరిగిందని చెప్పాము దర్యాప్తు జరపాలని సిబిఐ విచారణ కోరుతూ సిబిఐ లేఖ రాశాము సిబిఐ విచారణ ఎందుకు చేయడం లేదో బండి సంజయ్ సమాధానం చెప్పాలి.

ఎన్నికల ముందు కాళేశ్వరం లో అవినీతి జరిగిందని బీజేపీ నేతలు చెప్పారు..కేంద్రం లో బీజేపీ అధికారం లోకి వచ్చాక సిబిఐ విచారణ చేయడం లేదు.

కాళేశ్వరం విషయం లో కేసీఆర్ ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదో బండి సంజయ్ చెప్పాలి.

తుపాకీ మా భుజాల మీద కాల్చాలని బండి సంజయ్ చూస్తున్నారు..

దీతీం నేతల మద్దతు లేకుండా బీజేపీ కి రాష్ట్రం లో 8 సీట్లు వచ్చేవా..

హరీష్ రావు మద్దతు లేకుండా బీజేపీ ఎంపీ గా మెదక్ లో గెలిచారా..

బీజేపీ గెలుపు కోసం ప్రయత్నం చేశారు కాబట్టి మీపై కాళేశ్వరం సిబిఐ విచారణ చేయడం లేదు.

వరి వేస్తే ఉరి అన్నది మీరు మీరే కదా ఇవ్వాలా మీరు రైతుల కోసం ఏదో చేస్తున్నట్లు మొసలి కన్నీరు కారుస్తున్నారు..రైతులకు రుణమాఫీ రైతు బంధు బోనస్ ఇస్తుంది మా ప్రభుత్వం.

మా ప్రభుత్వం మక్కలు కూడా కొంటుంది..

బెంగాల్ లో బీజేపీ కి అనుకూల పరిస్థితులు లేవు..బెంగాల్ లో బీజేపీ ఓటు చోరీ తో గెలిచింది.

90లక్షల ఓట్లు తొలగించింది.

తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. ఓటు ను కాపాడుకోవాలి.

మమతబెనర్జీ, కేజ్రీవాల్ మీద కేసు లు పెట్టిన కేంద్ర ప్రభుత్వం కేసీఆర్ మీద ఎందుకు పెట్టడం లేదు బీజేపీ వాళ్ళు తలుచుకుంటే రేపు సీబీఐ విచారణ చేయవచ్చు.

ప్రజాబలం

06 మే 2026 బుధవారం

# ఎల్ నినో సూపర్ ఎల్ నినోగా ఎందుకు మారుతోందా...

ఈసారి ప్రకృతి తన వికృత రూపాన్ని ప్రదర్శించబోతోంది. 2026లో దేశం నిప్పుల కొలిమిలా మారుతోంది. రాబోయే రోజుల్లో ఆహార కొరత సామాన్యుడిని వేధించబోతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సూపర్ ఎల్ నినో కేవలం వాతావరణ మార్పు మాత్రమే కాదని దేశ ఆర్థిక వ్యవస్థను, సామాన్యుడి జీవనాన్ని అతలాకుతలం చేయగల శక్తి ఉంది. ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో సంభవించే ఒక అసాధారణ వాతావరణ పరిస్థితి. సాధారణంగా పసిఫిక్ మహాసముద్రం తూర్పు, మధ్య భాగాలలో నీటి ఉష్ణోగ్రతలు పెరగడాన్ని ఎల్ నినో అని పిలుస్తారు. సాధారణం పరిస్థితుల్లో భూమధ్యరేఖ వెంబడి వీచే ట్రేడ్ విండ్స్ వేడి నీటిని ఆసియా వైపు నెట్టివేస్తాయి. కానీ ఎల్ నినో సమయంలో ఈ పవనాలు బలహీనపడతాయి. దీని వల్ల వేడి నీరు వెనక్కి అమెరికా తీరం వైపు వెళ్తుంది. ఈ మార్పుల వల్ల ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ఫలితంగా ఒక చోట అతివృష్టి మరోచోట తీవ్రమైన కరవు ఏర్పడుతుంది. వాతావరణ నిపుణుల అంచనా ప్రకారం, 2026లో ఏర్పడబోయే ఎల్ నినో గత 140 ఏళ్లలో అత్యంత శక్తివంతమైనదిగా ఉండబోతోంది. యూర్‌కు చెందిన అధునాతన వాతావరణ నమూనాలు దీనిని మెగా ఎల్ నినో గా అభివర్ణిస్తున్నారు. సముద్ర మట్టం ఉష్ణోగ్రతలుగా సాధారణం కంటే చాలా ఎక్కువగా పెరగడం వల్ల దీని ప్రభావం కూడా అంతే తీవ్రంగా ఉండబోతోంది. ఇది 1877 నాటి భయంకరమైన కరవు పరిస్థితులను గుర్తుకు తెచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. భారత్ దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుంది. దేశంలోని దాదాపు 51 శాతం వ్యవసాయ పనులు వర్షంపై ఆధారపడి ఉన్నాయి. సూపర్ ఎల్ నో ప్రభావంతో 2026లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉంది. వర్షాలు సరిగా లేకుంటే పంట దిగుబడి తగ్గి, రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు సరికొత్త రికార్డులను సృష్టించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా తూర్పు, వాయవ్య, దక్షిణ భారత్‌లో సాధారణం కంటే ఎక్కువ వడగాల్పులు వీయవచ్చు. కేవలం పగటిపూట మాత్రమ కాదు, రాత్రి ఉష్ణోగ్రతలు కూడా అధికంగా ఉండటం వల్ల మానవ శరీరం చల్లబడే అవకాశం దొరకదు. ఇది ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. పంట ఉత్పత్తి తగ్గడం వల్ల ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్ని తాకవచ్చు. సాధారణ ఎల్ నినో సమయాల్లోనే ఆహార ధరలు 5 శాతం వరకు పెరుగుతాయి. సూపర్ ఎల్ నినో వస్తే మాత్రం ఈ పెరుగుదల మరింత ఎక్కువగా ఉండే ప్రమాదం ఉంది. ఇది సామాన్యుడిపై మోయలేని భారాన్ని మోపుతుంది. చెట్లు స్థానిక ఉష్ణోగ్రతను 12 డిగ్రీల వరకు తగ్గించ గలవు. కాబట్టి ఉన్న చెట్లను కాపాడుకోవడంతోపాటు కొత్త మొక్కలు నాటడం మంచిది. : ఎండ వేడికి ప్రజలు అబ్బా అంటున్నారు. ఉదయం 8 గంటల నుంచే భానుడి భగభగలు. బయటకు వెళితే చమటలు పట్టిస్తున్న వేడి సెగలు .ఇంట్లో ఉంటే ఉక్కపోత సెగలు. ఇదీ వేసవి పరిస్థితి. మధ్యాహ్నం తర్వాత పరిస్థితి మరింత దారుణం. బయటకు వెళితే క్షేమంగా తిరిగి వస్తామా అన్నట్లు ఉంది పరిస్థితి. కొందరు వేడి కారణంగా అనారోగ్యానికి గురవుతుండగా మరికొందరు వడదెబ్బతో ప్రాణాలు కోల్పోతున్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే డజన్ల కొద్దీ వడదెబ్బ మరణాలు సంభవించాయన్న వాస్తవం. ఈ సంక్షోభ తీవ్రతను స్పష్టం చేస్తోంది. ఏప్రిల్ నెలలోనే ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటిన నేపథ్యంలో మే నెలలో వడదెబ్బ ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందోనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బయటకు రాకపోవడం ఉత్తమం. తగినంత నీరు తాగడం, ఓఆర్ఎస్ వాడటం ద్వారా డీహైడ్రేషన్ నుంచి తప్పించుకోవచ్చు. కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, అడవుల సంరక్షణ ద్వారా దీర్ఘకాలికంగా ఇటువంటి వాతావరణ మార్పులను అడ్డుకోవచ్చు. వేసవి వచ్చిన ప్రతిసారి కలవరపెట్టే అంశం వడదెబ్బ. వడదెబ్బ బారిన పడి ప్రతిసారి అనేక మంది ప్రాణాలు కోల్పోతూ ఉండగా తెలుగు రాష్ట్రాలు సహా దేశవ్యాప్తంగా ఈసారి కూడా మరణాలు నమోదయ్యాయి. తెలంగాణలో ఏప్రిల్ 25న ఒక్క రోజే ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ వేసవిలో దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు సంభవించిన వడదెబ్బ మరణాల గురించి కచ్చితమైన సమాచారం లేకున్నా వివిధ రాష్ట్రాల్లో రోజూ పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నట్లు తెలిసింది. ఇందులో ఎక్కువగా పొలం పనులు చేసేవారు, పని మీద బయటకు వెళ్లిన వారే ఉంటున్నారు. ఏప్రిల్‌లో దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల వరకు నమోదయ్యాయి. మే మాసంలో ఎండలు మరింత విరుచుకపడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో మరో నెల రోజుల్లో వడదెబ్బ మరణాలు పెరగవచ్చనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

# ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి: ప్రధాని మోడీకి భట్టి విక్రమార్క విజ్ఞప్తి

మొదటి పేజీ తరువాయి

ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుంది

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కరీంనగర్ పర్యటనను పురస్కరించుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిజైన్ చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు గారు విజ్ఞప్తి చేశారు.

సిరిసిల్లా జిల్లా గంబిరావుపేట గ్రామంలోని పంతులుగారి తోటలో బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటేడ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని నాటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినప్పటికీ, తెలంగాణలో ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా ఆ హోదా కల్పించకపోవడం తెలంగాణ రాష్ట్రం పట్ల చూపుతున్న వివక్షతకు నిదర్శనమన్నారు.

తెలంగాణలో రైతులు పండించే ప్రతి పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర (మీస్తా) ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం, నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. కేవలం కొన్ని పంటలకే మద్దతు ధర ప్రకటించి మిగిలిన వాటి విషయంలో కేంద్రం తప్పించుకునే ప్రయత్నం చేయవద్దని, రాష్ట్రం సేకరించిన ప్రతి గింజను కేంద్రమే సేకరించి సకాలంలో నిధులు విడుదల చేయాలని కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం బహుళార్థక సాధక ప్రాజెక్టులను నిర్మించి, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రైతులకు అనేక రకాల ప్రోత్సహకాలు అందించి రైతులకు అండగా నిలబడిందన్నారు.

వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ వరి గడ్డిని ముడిసరుకుగా ఉపయోగించి బయో గ్యాస్ ఉత్పత్తి చేసే బృహత్తర ఆలోచనను కాంగ్రెస్ ప్రభుత్వం కార్యరూపంలోకి తెస్తోందన్నారు. సాధారణంగా పంట కోతల అనంతరం రైతులు పొలాల్లోనే గడ్డిని కాల్చివేయడం వల్ల వాతావరణం కలుషితమై ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ూాు×) పడిపోతున్న తరుణంలో, ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. దీనివల్ల పర్యావరణానికి రక్షణ కలగడమే కాకుండా, రైతులకు వ్యర్థాల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో, అభివృద్ధి చెందిన దేశాల బాటలో మన రైతాంగం కూడా అడుగులు వేయాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు. సమాజానికి ఆహారాన్ని అందించే రైతు, ఆరోగ్యకరమైన గాలిని కూడా అందించాలనే ఉద్దేశంతో పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్‌లకు సరఫరా చేయాలని కోరారు.

మరోవైపు, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలని కోరారు. కేవలం వరి మీదనే ఆధారపడకుండా ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు రైతులు దృష్టి సారించినప్పుడే ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని తెలిపారు. వీటి సాగు వల్ల రైతులకు ఆదాయం పెరగడమే కాకుండా సమాజానికి పోషక విలువలతో కూడిన ఆహారం అందించిన వారవుతారని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, పండించిన ప్రతి గింజకూ కనీస మద్దతు ధర (మీస్తా) కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉందని. మద్దతు ధర ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పుట చేసిందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని, ఈ మార్పులో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

# కాళేశ్వరం అవినీతి పై CBI మౌనం బీజేపి-బీఆర్ఎస్ లాలూచికి నిదర్శనం: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.



హైదరాబాద్ హన్మకొండ :కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి పై కమీషన్ విచారణ జరిపి అవినీతి జరిగిందని, ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని నివేదికను కేంద్ర దర్యాప్తు సంస్థ CBIకి అప్పగించి తొమ్మిది నెలలు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బీజేపి--బీఆర్ఎస్ మధ్య లాలూచి రాజకీయాలకు నిదర్శనమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి విమర్శించారు.

ఇద్దరు కేంద్ర మంత్రులు, బీజేపి ఎంపీలు చిత్తశుద్ధితో వ్యవహరించాలంటే రాజకీయ ప్రయోజనాల కోసం ఆలస్యం చేయకుండా కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై CBI ద్వారా సమగ్ర విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అప్పుడు మాత్రమే వారి నిజాయితి ప్రజలకు స్పష్టమవుతుందని అన్నారు.

ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో మంగళవారం హన్మకొండ జిల్లా ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో జరిగిన రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు.

ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ:

రూ.2 లక్షల పంట రుణమాఫీ

సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్

ఎకరాకు రూ.12,000 రైతు భరోసా

దశాబ్దాల భూ సమస్యల పరిష్కారానికి "భూభారతి"

వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

"కాంగ్రెస్ అంటేనే రైతు పక్షపాతి ప్రభుత్వం" అని మంత్రి స్పష్టం చేశారు.

రైతు మేళా -- ఆధునిక వ్యవసాయానికి వేదిక

మే 5, 6, 7 తేదీలలో నిర్వహిస్తున్న ఈ రైతు మేళాలో రైతులకు అవసరమైన యాంత్రిక పరికరాలను సబ్సీడీపై అందిస్తున్నామని మంత్రి తెలిపారు. రైతు సోదరులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

రైతు మేళా వేదికగా భూసార పరీక్షలు నిర్వహించిన అధికారులకు మంత్రి గారు సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు దనసరి సీతక్క గారు, కొండా సురేఖ గారు, ఎంపీ కడియం కావ్య గారు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి గారు, నాయిని రాజేందర్ రెడ్డి గారు, రేవూరి ప్రకాష్ రెడ్డి గారు, కె.ఆర్. నాగరాజు గారు, మేయర్ గుండు సుధారాణి గారు, అగ్రికల్చర్ సెక్రటరీ, హుడా చైర్మన్, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంతకుముందు రైతు మేళాలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మే 05 (ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99, రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్ - జోగిపేట ఈరోజు మంగళవారంమున్సిపాలిటీ పరిధి లోని శ్రీరామ గార్డెన్ లో జిల్లా మహిళా, శిశు,దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ, తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత స్కూటీలు, అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ ల పంపిణీ,కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో 10,మంది దివ్యాంగులకు స్కూటీ లను, 286, మంది అంగన్వాడి టీచర్లకు స్మార్ట్ ఫోన్లను, మంత్రి దామోదర్ రాజనర్సింహ పంపిణీ చేశారు.

# గడువులోగా కేబుల్ చానల్స్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్స్ ఇవ్వండి

## ఐ అండ్ పి ఆర్ కమిషనర్ ముకుంద రెడ్డిని కోరిన జర్నలిస్టు సంఘాల నేతలు

హైదరాబాద్ జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల నేతలు, కేబుల్ చానెల్స్ జర్నలిస్టుల జేఏసీ పోరాటం మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేబుల్ చానెల్స్ జర్నలిస్టులకు ఐఅండ్ పీఆర్ తో పాటు జిల్లాల్లో అక్రెడిటేషన్స్ ఇచ్చేందుకు మెమో నం:321ను జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన నూతన ఆదేశాల మేరకు మే 31 లోపు రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన అందరు కేబుల్ చానెల్స్ జర్నలిస్టులకు నూతన అక్రెడిటేషన్స్ ను ఇవ్వాలని మంగళవారం నాడు సమాచార పౌర సంబంధాల శాఖా కమిషనర్ జి.ముకుంద రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి కోరడం జరిగింది. అర్హులైన కేబుల్ చానెల్స్ ను లిస్ట్ ఔట్ చేస్తున్నామని, మే 31 లోపు కేబుల్ చానెల్స్ జర్నలిస్టులకు అక్రెడి టేషన్స్ ఇచ్చేందుకు కృషి చేస్తామని కమిషనర్ ముకుంద రెడ్డి తెలిపారు. ఐ అండ్ పి ఆర్ కమిషనర్ ను కలిసిన వారిలో తెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, వి5 న్యూస్ ఛానెల్ సీఈఓ కడకంచి వెంకటేష్, టీఎన్ ఎన్ సీఈఓ దేవేందర్, స్టూడియో 18 భరత్ కుమార్, ఎబి న్యూస్ సీఈఓ బ్రహ్మాచారి పలువురు కేబుల్ చానెల్స్ జర్నలిస్టులు ఉన్నారు.

# ఏరోస్పేస్ దిగ్గజాలకు వ్యూహాత్మక భాగస్వామిగా తెలంగాణ

## డ్రోన్ టెక్నాలజీ, శాటిలైట్ కమ్యూనికేషన్స్ లోనూ గ్లోబల్ లీడర్ గా నిలుపుతాం

## ఎకోసిస్టమ్, ఇన్నోవేషన్, ఆర్అండ్ డీ, ఇండస్ట్రీ రెడీ వర్క్ ఫోర్స్ పై ప్రత్యేక దృష్టి

## 'ఐటీపీ ఏరో - ఇండియా' మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ భూమి పూజలో మంత్రి శ్రీధర్ బాబు




అంతర్జాతీయ ఏరోస్పేస్ దిగ్గజాలకు తెలంగాణను ఒక వ్యూహాత్మక భాగస్వామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్రాన్ని కేవలం విడిభాగాల తయారీకే పరిమితం చేయకుండా.... గ్లోబల్ ఏరోస్పేస్ ఆర్ అండ్ డీ హబ్‌గా మార్చేందుకు అవసరమైన 'కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ హార్డ్ వేర్ పార్క్ (ఫేజ్ – 3) లో రూ.453 కోట్ల పెట్టుబడితో 10 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న 'ఐటీపీ ఏరో – ఇండియా' మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ కు ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... ఆనతికాలంలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌లలో ఒకటిగా తెలంగాణను నిలిపామన్నారు. వరుసగా అయిదేళ్లు కేంద్రం నుంచి 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకోవడం రాష్ట్రంలోని పటిష్ఠమైన ఎకో సిస్టమ్‌కు నిదర్శనమన్నారు. బోయింగ్, జీఈ ఏవియేషన్, సాఫ్రాన్, లాక్హీడ్ మార్టిన్, టాటా వంటి గ్లోబల్ ఏరోస్పేస్ దిగ్గజాలు ఇప్పటికే మన దగ్గర కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. తాజాగా... ఈ జాబితాలో స్పెయిన్ దిగ్గజ సంస్థ 'ఐటీపీ ఏరో' కూడా చేరడంతో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తమవుతుందన్నారు. సంప్రదాయ తయారీ రంగంతో పాటు డ్రోన్ టెక్నాలజీ, శాటిలైట్ కమ్యూనికేషన్స్ లాంటి నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీస్ లోనూ రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్‌గా నిలిపేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. అందుకు అవసరమైన... మౌలిక సదుపాయాల కల్పన, ఎకోసిస్టమ్ అభివృద్ధి, ఇన్నోవేషన్, ఆర్ అండ్ డీ, ఇండస్ట్రీ రెడీ వర్క్ ఫోర్స్ తయారీ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. విమాన ఇంజిన్ల తయారీలో వినియోగించే అత్యంత కీలకమైన విడిభాగాలు ఈ 'ఐటీపీ ఏరో -- ఇండియా' నూతన మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ లో ఉత్పత్తి అవుతాయన్నారు. వచ్చే ఏడాది నాటికి ఇక్కడ కార్యకలాపాలు పూర్తిస్థాయిలో ప్రారంభమవుతాయన్నారు. ప్రిసిషన్ ఇంజనీరింగ్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, క్వాలిటీ కంట్రోల్ తదితర విభాగాల్లో ప్రాథమికంగా 350 మంది నిపుణులకు (హై స్కిల్డ్) ఉపాధి లభిస్తుందని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య 600కు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐటీపీ గ్రూప్ సీఈవో ఈవా అజూలే, ఎండీ కార్లోస్ అల్జోలా, వైస్ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) వాలెంటిన్ గొరోనో, ఐటీపీ ఇండియా ఎండీ సందీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# సంకల్పం ఉంటే ఎలాంటి అడ్డంకులైనా అధిగమించవచ్చు

## కాళ్లతో 10 తరగతి పరీక్ష రాసిన ఒడిశాకు చెందిన లక్ష్మీ ఖేముడు.

## 240 మార్కులు సాధించి లక్ష్మీ



ఒడిశా మే 5 :సంకల్పం ఉంటే ఎలాంటి అడ్డంకులైనా అధిగమించవచ్చని మరోసారి నిరూపించింది ఒడిశాకు చెందిన ఓ బాలిక. పుట్టుకతోనే చేతులు లేకపోయినా, కాళ్లు సరిగా లేకున్నా పట్టు వదలని విక్రమార్కుడిలా చదువు కోసం పోరాడింది. చేతులు లేకపోతేనేం కాళ్లతో రాయడం నేర్చుకుంది. ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యాలు కల్పించినప్పటికీ వాటిని పక్కనపెట్టి, ఇతర విద్యార్థుల్లానే పరీక్ష హాల్లో కూర్చొని తన ప్రతిభను చాటేది. ఆ పట్టుదలతోనే 10వ తరగతి పరీక్షలో అద్భుతమైన ఫలితాలు సాధించింది. అలా తల్లిదండ్రులను గర్వపడేలా చేస్తూ, ఇతరులకు ఆదర్శంగా నిలిచింది. ఆమెనే ఒడిశాకు చెందిన లక్ష్మీ ఖేముడు.

చిన్ననాటి నుంచే చేతులు లేవు

మల్కన్?గిరి జిల్లాలోని ఢేపగుఢా గ్రామానికి చెందిన నారాయణ ఖేముడు రోజూవారి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అతడి పెద్ద కుమార్తె లక్ష్మీ ఖేముడు. పుట్టుకతోనే శారీరక దివ్యాంగురాలు. లక్ష్మీకి చేతులు, కాళ్లు సరిగా పనిచేయవు. సొంతంగా నిలబడే శక్తి కూడా ఆమెకు లేదు. అందుకే ఆమె వీల్‌చైరే ఆధారంగా జీవిస్తోంది. అయితే ఆమెకు బాగా చదువుకోవాలనే కోరిక మాత్రం ఉంది. లక్ష్మీ కోరికను ఆమె కుటుంబం అర్థం చేసుకుంది. తమకు ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా లక్ష్మీని చదివించడానికి ఏ మాత్రం తల్లిదండ్రులు వెనుకాడలేదు. లక్ష్మీ తండ్రి ఐదో తరగతి వరకు చదివారు. ఆమె తల్లి సుభద్ర నిరక్షరాస్యురాలు. అయినప్పటికీ ఆ దంపతులు తమ కుమార్తెకు ఉన్న చదువుకోవాలనే కోరిక నేరవేర్చేందుకు సిద్ధమయ్యారు. అలా లక్ష్మీ సింధిమాల ఉన్నత పాఠశాలలో తన విద్యను అభ్యసిస్తోంది.కాళ్లతో రాస్తూ పరీక్షల్లో ప్రతిభ

లక్ష్మీ చేతులు లేకపోయినా కాళ్లతో రాయడం సాధన చేసింది. అలా పదో తరగతి వరకు అందరి విద్యార్థులలాగానే పరీక్షలు రాస్తూ, మంచి మార్కులు సాధించేది. ఇటీవల జరిగిన పది పరీక్షలకు కూడా హాజరైంది. అయితే జిల్లా పరిపాలన దివ్యాంగుల కోసం ఇచ్చే ప్రత్యేక సదుపాయాలు కల్పించింది. కానీ లక్ష్మీ వాటిని వినియోగించుకోకుండా, అందరు విద్యార్థులతో పాటు కూర్చొని తన పరీక్షలను పూర్తి చేసింది. అలా కాళ్లతోనే కలాన్ని పట్టుకుని పరీక్షలుఎ రాసింది. అంతే కాకుండా 240 మార్కులను సాధించి, అందరి ప్రశంసలు అందుకుంది.

# హజ్రత్ ఖాజా బందె నవాజ్ దర్గా ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డి మే 5 :సదాశివపేట మండలం సూరారం గ్రామం లోని హజ్రత్ ఖాజే బందే నవాజ్ దర్గా 36 వ ఉర్సు ఉత్సవాల్లో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. దర్గా ను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉ తీమూడు రోజుల పాటు జరిగిన ఉర్సు లో భాగంగా ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఖవాలీ కార్యక్రమాలు నిర్వహించారు.

తెలంగాణ రాష్ట్రం తో పాటు కర్ణాటక నుండి పెద్ద ఎత్తున భక్తులు ఈ ఉర్సు లో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం లో సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, సూరారం గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# వెస్సో స్థాపన దినోత్సవ సందర్భంగా 'అన్నదానం'




హైద్రాబాద్ మే.5 వెస్సో సంస్థ స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని వెస్సో టీమ్ ముషీరాబాద్ గాంధీ హాస్పిటల్ లో మంగళవారం జిహెచ్ఎంసి కాంప్లెక్స్ ఆవరణలో జనహిత సేవ ట్రస్ట్ వారి సహకారంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. 140 మంది మధ్యాహ్న భోజనం చేసిన ఈ సేవా కార్యక్రమానికి ట్రస్ట్ సంస్థాపక అధ్యక్షుడు బంగారు తాతారావు తో పాటు, విశ్వంలో విలీనం సేవా ట్రస్ట్ నుండి పెంట శ్రీనివాస ఆచార్య మరియు విశ్వకర్మ ఫౌండేషన్ అండ్ సేవా ట్రస్ట్ నుండి వింజరపు గోవిందరావు అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా బంగారు తాతారావు మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరములుగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల ద్వారా ఆరువేల మందికి పైగా లబ్ధి పొందారని, ఇప్పటివరకు మొత్తం ఒక కోటి ఐదు లక్షలు వైద్యం, విద్య, పేద వధువు వివాహం, మహిళా సాధికారత, అంత్యక్రియలు వంటి వివిధ పథకాలకు చెందిన లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు. నూటికి నూరు శాతం 'పారదర్శకత' తో పని చేయడం వలననే వెస్సో ట్రస్ట్ కు దాతల నుండి మంచి ఆదరణ లభించిందని, తాము సేవలకే ప్రాధాన్యత ఇస్తామని, ఇతరత్రా హంగు, ఆర్భాటాలకు తమ వద్ద తావు లేదని తెలిపారు. గత సంవత్సరం నిర్వహణ ఖర్చులు కేవలం 1.73 శాతమని, ప్రతి సేవా కార్యక్రమానికి గౌరవ దాతల నుండి వచ్చిన విరాళాల మొత్తాన్ని వచ్చినది వచ్చినట్లుగా లబ్ధిదారులకు వెనువెంటనే అందజేస్తామని, లెక్కలు పత్రాలకు సంవత్సరం ఆఖరి వరకు ఆగవలసిన అవసరం కూడా లేదని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భావ సారూప్యత కలిగిన విశ్వకర్మీయ సేవా సంస్థలతో చేయి చేయి కలిపి సమాజ హితం కొరకు పని చేయడమే తమ ధ్యేయమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగావెస్సో ను వెనుక ఉండి నడిపిస్తున్న గౌరవ దాతలకు ఆయన హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# క్రీడా సంఘాలకు సహకరిస్తాం

## మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి



హైద్రాబాద్ మే 5 :రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి కొరకు క్రీడా సంఘాలు నిర్వహించే అన్ని కార్యక్రమాల విజయవంతనికి సంపూర్ణంగా సహకరిస్తామని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, చైర్మన్ శివసేనారెడ్డిలు తెలిపారు.

ఈరోజు ఎల్ బి స్టేడియంలో 09 & 10 మే 2026 నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్

అధికారిక బ్రోచర్‌ను క్రీడా శాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి గారు మరియు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శ్రీ కె. శివసేన రెడ్డి గారు ఆవిష్కరించారు. ఈ చాంపియన్‌షిప్ విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు

ఈ కార్యక్రమంలోతెలంగాణ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎం. మహిపాల్ గారు, ఆర్ఆర్ జిల్లా జనరల్ సెక్రటరీ ఎం. నర్సింగ్ రావు , హైదరాబాద్ జిల్లా జనరల్ సెక్రటరీ ఎం. ప్రవీణ్ కుమార్ మరియు వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎన్. సంతోష్ పాల్గొని, తెలంగాణలో కిక్‌బాక్సింగ్ అభివృద్ధికి అందిస్తున్న ప్రోత్సాహం మరియు సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పుని గౌరవించాలి

## బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



హైద్రాబాద్ మే 5 :యావత్ ప్రపంచం ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుతుంటే ప్రధాని నరేంద్ర మోదీ భారతదేశాన్ని ప్రగతి పథంపై పరుగులు పెట్టిస్తోన్న నేపథ్యంలో తెలంగాణ ప్రజలు మోదీకి ఘనస్వాగతం పలకాలని కోరుతున్నాను.

బెంగాల్ లో 100 సీట్లలో ఓట్ చోరీ జరిగిందని మమత అంటున్నారు. దీనికి రాహుల్ గాంధీ కూడా మద్దతు తెలిపాడు. ఓటు చోరి చేసేటోళ్లే చోరీ గురించి మాట్లాడుతున్నారు. వీళ్ళందరికీ చోరీ అలవాటే. అప్పుడు గెలిచారు, ఇప్పుడు వారి చోరీ నడవట్లేదు.

ఎన్నికల్లో ఓడిపోతే ప్రజల తీర్పుని అంగీకరించాలి, ప్రజలను అవమానపరిచే మాటలు మాట్లాడడం మంచిది కాదు.

ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పు సర్వశక్తివంతమైనది, సర్వోత్తమైనది. దానిని అవమాన పరుస్తుంటే కాంగ్రెస్ మద్దతు తెలపడమా?

మూడు సార్లు మమతా గెలిచినప్పుడు మేం ఏమైనా అన్నామా? ప్రజా తీర్పును గౌరవించాం. కానీ వాళ్లు ఓడిపోతే ఈవీఎంలు, ఈసీఐ, దేశాన్ని నిందిస్తారు.

ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పుని గౌరవించాల్సిన అవసరం ఉన్నదన్నారు.

# రైతుల ఆత్మగౌరవానికి ప్రతీక రాజముద్ర కలిగిన పట్టాదారు పాస్ పుస్తకాలు:

## దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వెల్లడి

పెదపాడు (కొక్కెరపాడు), మే 05: ఆంధ్రప్రదేశ్ రైతు సోదరుల భూములకు అసలైన భద్రత మరియు ఆత్మగౌరవాన్ని కల్పిస్తూ కూటమి ప్రభుత్వం రీ సర్వేలు జరిపించి, రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తోందని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం పెదపాడు మండలం కొక్కెరపాడు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, వేంపాడు రెవెన్యూ గ్రామ పరిధిలోకి చెందిన 612 పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ గారికి స్థానిక కూటమి నాయకులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. "గత వైసిపి పాలనలో రైతుల పాస్ పుస్తకాలపై రాజముద్రను తొలగించి, వారి ఫోటోలు వేసుకుని భూములపై హక్కులను కాలరాసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. పట్టాదారు పాస్ పుస్తకం అంటే రైతన్నకు ఒక ధైర్యం, గౌరవం అని.. ఆ గౌరవాన్ని మళ్లీ మన కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిందన్నారు. ఏ వ్యక్తి ఫోటోతో కాకుండా, అధికారిక రాజముద్రతో ఉన్న ఈ పుస్తకాలే రైతు భూమికి అసలైన రక్షణ" అని పేర్కొన్నారు.పాస్ పుస్తకాల్లో ఏవైనా సాంకేతిక పొరపాట్లు లేదా వివరాల్లో తప్పులు ఉంటే వెంటనే సరిచేయాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే గారు ఆదేశించారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సత్వరమే పరిష్కారం చూపాలన్నారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన ముఖాముఖిలో ప్రజలు తమ స్థానిక సమస్యలను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకురాగా, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు స్పాట్ లోనే ఆదేశాలు జారీ చేశారు. భూ రికార్డుల ప్రక్షాళనలో పారదర్శకత ఉండాలనీ, రైతుల నుండి వచ్చే వినతులపై అలసత్వం వహించకూడదు అని, గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి అని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారు అధికారులకు సూచించారు...ఈ కార్యక్రమంలో దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గారపాటి రామసీత, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు బొప్పన సుధా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పలపాటి రాంప్రసాద్, క్లస్టర్ ఇంచార్జ్ గుత్తా అనిల్, మండల తహసిల్దార్ కృష్ణ జ్యోతి, వట్లూరు సొసైటీ చైర్మన్ కొమ్మన లక్ష్మణ్ మోహన్ (బుడ్డియ్య ), చంటి బాబు, మండల పార్టీ అధ్యక్షులు మరడాని రవి, సెక్రటరీ వేగుంట సురేష్ బాబు, క్లస్టర్ ఇంచార్జ్ ముళ్ళపూడి సాంబశివరావు, సహా పలువురు కూటమి నాయకులు మండల పార్టీల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జిలు, సొసైటీల చైర్మన్లు , వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారూ

# స్టీల్ ప్లాంట్ కు బూస్టర్ డోస్

విశాఖపట్టణం, మే 5 వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పూర్వ వైభవానికి తీసుకురావాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రెండో విడత ఆర్థిక చేయూతను ప్రకటించింది. ఇప్పటికే గతేడాది రూ.11,440 కోట్లు కేటాయించి ప్లాంట్‌ను గాడిలో పెట్టిన కేంద్రం, ఇప్పుడు కార్యకలాపాలను దీర్ఘకాలం పాటు సుస్థిరంగా కొనసాగించేందుకు అదనంగా మరో రూ.8,097 కోట్లు మంజూరు చేయనుంది. కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఈ ప్యాకేజీకి సంబంధించిన ఫైల్‌ను క్లియర్ చేసి, ఆర్థికశాఖ ఆమోదం కోసం పంపారు.ఆర్థికశాఖలోని వ్యయ విభాగం పచ్చజెండా ఊపిన వెంటనే ఈ అంశం కేంద్ర మంత్రివర్గం ముందుకు వెళ్లనుంది. క్యాబినెట్ ఆమోదం పొందిన వెంటనే ఈ నిధులు స్టీల్‌ప్లాంట్‌కు అందుతాయి. తొలిదశ ప్యాకేజీ తరహాలోనే, ఈ రూ.8,097 కోట్లను కూడా ఈక్విటీ రూపంలో సమకూర్చాలని కేంద్ర ఉక్కుశాఖ నిర్ణయించింది. గతంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్రాన్ని సంప్రదించడంతో రూ.11,440 కోట్ల ప్యాకేజీ అందింది. అందులో రూ.10,300 కోట్లు ఈక్విటీగా, మిగిలిన రూ.1,140 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ రుణాల రూపంలో అందాయి. ఇప్పుడు అందుతున్న రెండో ప్యాకేజీతో ప్లాంట్ ఆర్థికంగా మరింత బలోపేతం కానుంది.ప్రస్తుతం విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి. దీనివల్ల ఉక్కు ఉత్పత్తి మరియు అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. ప్లాంట్ కార్యకలాపాలు ఇప్పుడిప్పుడే స్థిరపడుతున్న తరుణంలో, కేంద్రం అందిస్తున్న ఈ రెండో విడత సాయం ప్లాంట్ మనుగడకు అత్యంత కీలకం కానుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ స్టీల్‌ప్లాంట్ సమస్యలను పరిష్కరిస్తోంది. ఉక్కు కార్మికుల ఆందోళనలు, ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాల నేపథ్యంలో కేంద్రం వరుసగా ఇస్తున్న ఈ ప్యాకేజీలు కార్మికుల్లో ప్రజల్లో కొత్త ఆశలు చిగురింపజేస్తున్నాయి.

# మళ్లీ తెరపైకి నక్ష ప్రాజెక్ట్

విజయవాడ, మే 5 సొంత ఇల్లు అనేది సగటు మనిషి జీవితకాల కల. రెక్కలు ముక్కలు చేసుకొని సంపాదించిన ఆస్తికి సరైన పత్రాలు ఉంటే ఆ మనశ్శాంతే వేరు. పట్టణాలు, నగరాలలో ఆస్తుల సరిహద్దుల విషయంలోనో యాజమాన్య హక్కుల విషయంలో తరచూ ఏదో ఒక వివాదం తలెత్తుతుంది. పాతకాలపు రికార్డులు, అస్పష్టమైన కొలతలు సామాన్యులను కోర్టుల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుతుంటాయి. ఈ గందరగోళానికి తెరదించి, ప్రతి చదరపు అడుగు భూమికి డిజిటల్ గుర్తింపునివ్వాలనే సంకల్పం ఇప్పుడు కార్యరూపం దాలుస్తోంది. ఆకాశం నుంచి డ్రోన్ల నిఘా, భూమిపై అత్యాధునిక సాంకేతికత మేళవింపుతో సాగుతున్న బృహత్తర ప్రక్రియ, పట్టణ వాసుల ఆస్తి హక్కులకు రక్షణ కవచంలా మారబోతోంది. అటకెక్కిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టు మళ్లీ వెలుగులోకి రావడం, లక్షలాది మంది ఇళ్ల యజమానుల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. 'నక్ష' ప్రాజెక్టుకు పునర్జీవం నగరాలు, పట్టణాల్లో ప్రజల ఇళ్లు, భూములకు అధికారికంగా 'ప్రాపర్టీ కార్డులు' జారీ చేసే లక్ష్యంతో కేంద్రం ప్రారంభించిన 'నక్ష' ప్రాజెక్టు పనులు ఆంధ్రప్రదేశ్ లో ప్రారంభం కానున్నాయి. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పక్కన పెట్టగా ప్రస్తుత ప్రభుత్వం కేంద్రంతో సంప్రదింపులు జరిపి, ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించేందుకు సిద్ధమైంది. గ్రామాల్లో అమలు చేస్తున్న 'స్వామిత్వ' తరహాలోనే, పట్టణ ప్రాంతాల్లో కూడా డ్రోన్ సర్వే, జీఐఎస్ టెక్నాలజీ ఆధారంగా ప్రతి ఆస్తిని డిజిటలైజ్ చేయాలని నిర్ణయించారు. దీనివల్ల ఆస్తుల వివరాల్లో పారదర్శకత పెరగడమే కాకుండా, యజమానులకు పూర్తి స్థాయి భద్రత లభిస్తుంది. తొలి దశలో రాష్ట్రంలోని ఒంగోలు, అనంతపురం, నెల్లూరు, కర్నూలు, గుంటూరు, కాకినాడ, తిరుపతి, ఏలూరు, మంగళగిరి–తాడేపల్లితో పాటు కుప్పం వంటి ప్రధాన నగరాలు, పట్టణాలను ఈ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. గతంలో డ్రోన్ సర్వే వరకు పనులు జరిగినప్పటికీ, కీలకమైన క్షేత్ర స్థాయి పరిశీలన, రికార్డుల క్రోడీకరణ, మ్యాపింగ్ వంటి పనులను గత పాలకులు విస్మరించారు. ఫలితంగా ప్రజలకు అందాల్సిన ప్రాపర్టీ కార్డులు అటకెక్కాయి.

ఇప్పుడు ప్రభుత్వం 2027, మార్చి నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇతర రాష్ట్రాలు కార్డుల జారీలో ముందంజలో ఉన్న నేపథ్యంలో, మన రాష్ట్రంలోనూ పనులను వేగవంతం చేయాలని యోచిస్తున్నారు. . ఈ ప్రాపర్టీ కార్డు కేవలం కాగితపు ముక్క కాదు.. ఇవి డిజిటల్ పవర్ హౌస్‌లా పనిచేస్తాయి. కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఆ ఆస్తికి సంబంధించిన పూర్తి జాతకం కనిపిస్తుంది. ఎవరు యజమాని? భవనం విస్తీర్ణం ఎంత? ఖాళీ స్థలం ఎంత? వంటి వివరాలన్నీ నిక్షిప్తమై ఉంటాయి. దీనివల్ల భవిష్యత్తులో ఆస్తుల కొనుగోలు, అమ్మకాల సమయంలో మోసాలకు ఆస్కారం ఉండదు. రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ప్రక్రియలు మునుపటి కంటే సులభతరం అవుతాయి. ప్రాపర్టీ కార్డులు ఉన్నవారికి బ్యాంకులు రుణాల జారీలో ప్రాధాన్యతనిస్తాయని అధికారులు చెబుతున్నారు

కేవలం వ్యక్తిగత ప్రయోజనాలే కాకుండా, పట్టణాల అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడానికి కూడా ఈ సర్వే డేటా ఎంతో ఉపయోగపడుతుంది. ఏ ప్రాంతంలో ఎంత ఆస్తి ఉంది, ఎక్కడ రోడ్ల విస్తరణ అవసరం, పౌర వసతుల కల్పన ఎక్కడ జరగాలి వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన కలుగుతుంది.

ఆస్తుల క్రయవిక్రయాల్లో తలెత్తే లిటిగేషన్లకు ఈ కార్డు శాశ్వత పరిష్కారం. ప్రాపర్టీ కార్డుల ద్వారా లభించే కీలక ప్రయోజనాలు క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా ఆస్తుల వివరాల తక్షణ లభ్యత. భూమి, భవనం విస్తీర్ణం, యాజమాన్య హక్కులపై స్పష్టత. రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ప్రక్రియలో వేగం, పారదర్శకత. ఈ కార్డుల ఆధారంగా బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు పొందే వెసులుబాటు. ఆక్రమణలకు తావు లేకుండా ఆస్తుల చుట్టూ డిజిటల్ రక్షణ. మొత్తానికి, ఆగిపోయిన 'నక్ష' ప్రాజెక్టు మళ్లీ పట్టాలెక్కడం పట్టణ వాసులకు పెద్ద ఊరటనిచ్చే అంశం. 2027 నాటికి ప్రతి ఇంటికీ ప్రాపర్టీ కార్డు అందించాలనే లక్ష్యం నెరవేరితే, రాష్ట్రంలో భూ వివాదాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

# ఏపీలోగునపం-గొడ్డలి రాజకీయాలు

విజయవాడ, మే 5 వైసీపీ రాజకీయ వ్యూహాలు ఏంటో కానీ స్పందించాల్సిన వాటి మీద చాలా లేటుగా రియాక్ట్ అవుతారని అంటారు. అప్పటికే జరగాల్సినది జరిగిపోతుందని కూడా పార్టీలోనూ అంతర్మథనం చెందుతూ ఉంటారు. ప్రభుత్వంలో ఉన్నపుడు కానీ అంతకు ముందు విపక్షంలో ఉన్నపుడు కానీ ప్రత్యర్థులు చేసే ఘాటు విమర్శల మీద వెంటనే రియాక్ట్ కాకపోవడం వల్ల భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వచ్చిందని వైసీపీ నేతలు గుర్తు చేసుకుంటూ ఉంటారు. రాజకీయాల్లో టైం టైమింగ్ ఈ రెండూ చాలా ముఖ్యం. ఈ విషయంలో వైసీపీ ఎపుడూ వెనకబాటుతోనే ఉంటోంది అని అంటున్నారు. తెలుగుదేశం పార్టీ వైసీపీని విమర్శించే విషయంలో ఎప్పటికప్పుడు కొత్త వ్యూహాలతో సిద్ధంగా ఉంటుంది. అధికారంలో వైసీపీ ఉన్నప్పుడు అయిదేళ్ళూ జగన్ ని సైకో అంటూ వైసీపీని సైకో పార్టీ అని విపరీతంగా టీడీపీ ప్రచారం చేసింది. దానిని వైసీపీ సీరియస్ గా తీసుకోలేదు, ఫలితాలు వచ్చిన తరువాత ఏమి జరిగింది అన్నది బోధపడింది అని అంటున్నారు. ఇపుడు కొత్తగా గొడ్డలి పార్టీ అని వైసీపీకి పేరు పెట్టి టీడీపీ పెద్ద ఎత్తున జనంలోకి దానిని ప్రచారం చేస్తోంది. ఇది చాలా రోజులుగా జరుగుతోంది. అయితే వైసీపీ ఇపుడు ఆలస్యంగా మేలుకొంది. అందుకే వరసబెట్టి తమ పార్టీకి చెందిన మాజీ మంత్రుల చేత కౌంటర్లు ఇప్పిస్తోంది. ఇక మాజీ మంత్రి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధనరెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ తమది గొడ్డలి పార్టీ అని ప్రచారం చేస్తున్న చంద్రబాబు మీద తీవ్ర విమర్శలు చేశారు. మామ పార్టీకి గునపం పెట్టి వెన్నుపోటు పొడిచింది బాబు కాదా అని ప్రశ్నించారు. ఆ మీదట ప్రతీ ఎన్నికల్లో ప్రజలకు హామీలు ఇవ్వడం వాటిని నెరవేర్చకుండా గునపంతో జనాలను వెన్నుపోటు పొడవడం కూడా బాబుకు అలవాటే అని ఆయన ఫైర్ అయ్యారు. మీ పార్టీ గునపం పార్టీ అందుకే గునపం గుర్తునే పెట్టుకోవాలని ఆయన సూచించారు. ఆయన తరహాలో మరింత మంది మాజీ మంత్రులు నాయకులు కూడా టీడీపీ మీద విమర్శలు చేస్తున్నారు.ఈ తరహా విమర్శలు కానీ ప్రచారం కానీ న్యూట్రల్ సెక్షన్లలో తీవ్రమైన ప్రభావం చూపిస్తాయని అంటున్నారు విద్యావంతులు మేధావులు అలాగే చదువరులు ఉద్యోగస్తులు తటస్థులలో వీటి మీద చర్చ సాగుతూ ఉంటుంది. ఈ సెక్షన్లు ఎన్నికల సమయంలో కీలకంగా మారుతారు. మౌత్ పబ్లిసిటీ ద్వారా వీరి అభిప్రాయాలు మిగిలిన జనాలకు చేరి ఫలితం మీద పడుతుంది అన్న విశ్లేషణలు ఉన్నాయి. అందుకే టీడీపీ వైసీపీ విషయంలో ఎప్పటికపుడు కొత్త ఎత్తుగడలతో ముందుకు సాగుతోంది. కానీ వైసీపీ మాత్రం ఇవేమీ పట్టినట్లుగా ఉండడం వల్ల ఇబ్బంది పడుతోంది అని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. సరికొత్త విధానానికి ప్రభుత్వం శ్రీకారం.. ఇపుడు గొడ్డలి అంటే వైసీపీ గుర్తుకు వచ్చేలా ఉధృతమైన ప్రచారం సాగిన నేపథ్యంలో వైసీపీ గునపం అని వెన్నుపోటు అని టీడీపీ మీద కౌంటర్లు వేస్తోంది. మరి ఇవి జనంలోకి ఏ మేరకు వెళ్తాయి ఒక వేళ వెళ్తే ఈ రెండింటి మీద జనాలలో చర్చ జరిగి వారు ఏ వైపు మొగ్గు చూపిస్తారు అన్నది చూడాల్సి ఉంది. ఇవన్నీ పక్కన పెడితే గొడ్డలి పార్టీ అని అంటూంటే వైసీపీకి ఎక్కడో గట్టిగా గుచ్చుకుంటోంది అని అంటున్నారు. మరి వైసీపీ సున్నితత్వం మీదనే టీడీపీ దెబ్బ కొడుతూ రాజకీయ రచ్చకు తెర తీస్తోందా అన్నదే అసలైన చర్చ.

# రాహుల్ గాంధీపై 99 ట్రెండింగ్...

న్యూఢిల్లీ, మే 5, (న్యూస్ పల్స్) వెస్ట్ బెంగాల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత.. పాండిచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతాన్ని కైవసం చేసుకున్న తర్వాత.. బిజెపి ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి. తమిళనాడులో కూడా నిర్ణయాత్మక పాత్రను బిజెపి ఆధ్వర్యంలోని ఏఐడీఎంకే పోషిస్తోంది. ఈ నేపథ్యంలో బిజెపి సోషల్ మీడియా విభాగం కాంగ్రెస్ పార్టీ మీద దాడిని పెంచింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ యువరాజు రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకొని విమర్శలు ప్రారంభించింది. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఓటములను తేదీలు, సంవత్సరాలతో పేర్కొంటూ.. తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది బిజెపి ఐటి విభాగం. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బిజెపిని ఇబ్బంది పెట్టింది. చాలావరకు పార్లమెంటు స్థానాన్ని గెలుచుకొని.. కమలం పార్టీకి షాక్ ఇచ్చింది. దీంతో బిజెపి టిడిపి టిడిపి, నితీష్ కుమార్ పార్టీ సపోర్ట్ తీసుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత బిజెపి ఇక ఏమాత్రం ఆలస్యం చేయలేదు. జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ జోరు చూపించింది. కాంగ్రెస్ లేని భారతదేశం అనే నినాదాన్ని నిజం చేసి చూపించే విధంగా ప్రయత్నించింది. ప్రతి ఎన్నికల్లోను జోరు చూపించింది. చెప్పుకోదగ్గ స్థాయి నుంచి మొదలు పెడితే.. అధికారాన్ని దక్కించుకునే స్థానాలను సొంతం చేసుకుని అదరగొట్టింది.వెస్ట్ బెంగాల్ లో ఘనవిజయం తర్వాత కాంగ్రెస్ పార్టీ యువరాజు రాహుల్ గాంధీకి బిజెపి సెటైర్లు వేసింది. రెండు దశాబ్దాల కాలంలో దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికలు.. ఉప ఎన్నికలను ప్రస్తావిస్తూ.. 99 ఓటములతో రాహుల్ గాంధీ రికార్డ్ సృష్టించారని ఎద్దేవా చేసింది."రాష్ట్రాలు మారుతున్నాయి. సంవత్సరాలు మారుతున్నాయి. ఫలితం మాత్రం దాదాపుగా మారదు. ఆర్భాటం చేస్తున్నారు. ప్రచారం చేస్తున్నారు. నినాదాలు ఎత్తుకుంటున్నారు. అవకాశానికి తగ్గట్టుగా నినాదాలను మార్చేసుకుంటున్నారు. ఇన్ని చేసినప్పటికీ ఫలితాలు ఒక విధంగా ఉంటాయి.. ఆ ఫలితం పేరు ఓటమి.. ఈ ఓటమి మీతో వస్తూనే ఉంటుంది. వెల్ డన్ రాహుల్ జి" అంటూ బిజెపి సోషల్ మీడియా పేర్కొంది.వెస్ట్ బెంగాల్లో కాంగ్రెస్ పార్టీ మమతాకు సపోర్ట్ చేయలేదు. ఒంటరిగానే పోటీ చేసింది..

# కలెక్టర్ వైఖరితో రెవెన్యూ శాఖలో వణుకు

తిరుపతి, మే 5 ఆ జిల్లా కలెక్టర్ అందరికీ ఒకే రాజకీయ నాయకులు సహా అన్ని వర్గాలు ఇబ్బంది లేదంటున్నాయిగానీ ఒక గవర్నమెంట్ డిపార్ట్‌మెంటే వద్దనుకుంటోందట. సాధారణంగా? ఎమ్మెల్యేలకు, కలెక్టర్లకు వివిధ అంశాలకు సంబంధించిన అభిప్రాయ భేదాలు వస్తుంటాయి. పరిష్కారం ఫైళ్లలో కాదు, ఫీల్డ్‌లో ఉండాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్టు జిల్లాలో చెప్పుకుంటున్నారు. అదే సమయంలో ఏళ్ళ తరబడి అవినీతి అరచేతి మందాన పేరుకుపోయి, నిర్లక్ష్యం నిలువెత్తునా పేరుకుపోయిన ప్రభుత్వ విభాగాల తుప్పు వదిలించే పని కూడా మొదలుపెట్టారట వెంకటేశ్వర్. ఆయన చర్యలతో ముఖ్యంగా రెవెన్యూ శాఖలో ఎప్పుడూ లేని విధంగా ఒక రకమైన వణుకు మొదలైందని చెప్పుకుంటున్నారు.కలెక్టర్ ఎప్పుడు, ఏ రూపంలో ఏ ఆఫీసుపై రైడ్ చేస్తారో తెలియక రెవెన్యూ అధికారులు వణుకుతున్నట్టు తెలుస్తోంది. అందుకు ఇటీవల పుల్లంపేట మండలంలో జరిగిన ఘటననే ఉదాహరణగా చెబుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఒక మాజీ సైనికుడి భూ సమస్య పరిష్కారం విషయంలో జరిగిన జాప్యాన్ని తీవ్రంగా పరిగణించారట కలెక్టర్. ఆ మాజీ సైనికుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో? వెంటనే స్పందించిన కలెక్టర్.. తన ఎదురుగానే బాధితుడితో తహసీల్దారుకు ఫోన్ చేయించారు. అట్నుంచి అత్యంత నిర్లక్ష్యంగా సమాధానం రావడంతో డైరెక్ట్‌గా కాల్‌లోకి వచ్చిన కలెక్టర్ బాధితుడికి న్యాయం చేయకపోగా కబ్జా చేసినవారికి మద్దతు తెలుపుతావా స్పాట్‌లోనే తహశీల్దార్, కలెక్టర్‌ని సస్పెండ్ చేశారు. ఈ ఘటన జిల్లా రెవెన్యూ వర్గాల్లో కలకలం రేపింది. అలాగే వాకాడు తహసీల్దార్‌పై వచ్చిన వేధింపుల ఆరోపణల విషయంలోనూ కఠినంగా వ్యవహరించి, తక్షణమే చర్యలు తీసుకున్నారు. ఇలా.. తిరుపతి జిల్లాలో ఇప్పటిదాకా కొద్దిమంది సస్పెండ్ కాగా చాలామంది అధికారులు బదిలీ అయ్యారు.మరోవైపు కేవలం ఆర్డర్లు వేయడమే కాకుండా బైక్‌ల మీద పర్యటిస్తూ, గ్రౌండ్ లెవల్‌లో ఏం జరుగుతోందో కూడా కలెక్టర్ తెలుసుకోవడం రెవెన్యూ సిబ్బందికి మింగుడు పడటం లేదట. ఇక పొలిటికల్ సర్కిల్స్‌లోనూ వెంకటేశ్వర్ గురించి ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. సాధారణంగా ఎమ్మెల్యేలకు, కలెక్టర్లకు మధ్య ఏదో ఒక విషయంలో గ్యాప్ ఉంటుంది. ఇదే జిల్లాలో గతంలో అలాంటివి జరిగాయి కూడా. కానీ? ఇప్పుడు సీన్ రివర్స్‌లో ఉందట. పలువురు ఎమ్మెల్యేలే స్వయంగా ఈమధ్య జరిగిన ఓ సమావేశంలో మాకు ఈ కలెక్టరే కావాలని సీఎంని కోరినట్టు తెలిసింది. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు, రోడ్ల నిర్మాణం వేగంగా జరుగుతుండటంతో పాటు ఎమ్మెల్యేల పనులు కూడా ఎక్కడా పెండింగ్ ఉండటం లేదని చెప్పుకుంటున్నారు. అయితే రాజకీయ సిఫార్సులకంటే రూల్స్‌కే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ ఒకరిద్దరికి లోలోపల అసంతృప్తిగా ఉన్నా? ఓవరాల్‌గా చూసుకున్నప్పుడు ఓకే అనుకుంటూ బయటికి ఏమీ అనలేకపోతున్నారట. ఇక లా అండ్ ఆర్డర్ విషయంలోనూ ఎస్పీ సుబ్బారాయుడుతో కలిసి పని చేస్తున్న వ్యవహారం చర్చనీయాంశం అయింది.రోడ్డు ప్రమాదాల నివారణ కోసం 14 గంటల బస్సు యాత్రలు చేపట్టడం, గంజాయి కట్టడికి చర్యలు, 20కోట్ల విలువైన గంజాయి కాల్చివేత లాంటి వ్యవహారాల్లో కలెక్టర్, ఎస్పీ సమన్వయంతో పని చేస్తున్నారు. ఇక టీటీడీ బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి లాంటి భారీ కార్యక్రమాల్లోనూ ప్రోటోకాల్‌కే పరిమితం కాకుండా అన్నిటిలో జోక్యం చేసుకుంటున్నారు. టీటీడీలోనూ లా అండ్ ఆర్డర్ విషయంలో కలెక్టర్ చొరవ చూపిస్తున్నారు. మొత్తం మీద అందరూ తిరుపతి కలెక్టర్ ఓకే అంటుంటే సొంత రెవెన్యూ డిపార్ట్‌మెంట్ మాత్రం మాకొద్దు బాబోయ్ ఈ ఆఫీసర్ అంటూ గగ్గోలు పెట్టడం ఆసక్తికరంగా మారింది. సార్.. కాస్త వేగం తగ్గించాలి.. ఆకస్మిక తనిఖీలు ఆపాలంటూ కలెక్టరేట్ గోడల మధ్య గుసగుసలు వినిపిస్తున్నాయటా. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మార్కులు పడ్డా, ఎమ్మెల్యేల మద్దతు ఉన్నా.. రెవెన్యూ వర్గాల్లో అసహనం ఆయనపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ప్రస్తుతానికి సస్పెన్స్.

# జగనన్న టెక్‌ఫోర్స్ ప్రోగ్రాం

విజయవాడ, మే 5 సామాజిక మాధ్యమాల్లో వైసీపీ యాక్టివిటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అధికారంలో ఉన్నప్పుడు, ప్రతిపక్షంలోకి వచ్చాక కూడా సోషల్ మీడియాను గట్టిగానే వాడుతూ ఉంటుంది పార్టీ. అయితే ప్రజల మీద దాని ప్రభావం దృష్ట్యా ఇక నుంచి నెక్స్ట్ లెవల్‌కు తీసుకువెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోందట అధిష్టానం. జగన్ చేస్తున్న రైతు పరామర్శ యాత్రలు, పీపీపీపై పోరుబాట, పార్టీ పరంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలు సోషల్ మీడియా ట్రెండింగ్‌లో ఉంటున్నావాటికి ఇంకా మైలేజ్ రావాల్సి ఉందని, ఆశించిన మేర రాలేదన్న అభిప్రాయం వైసీపీ పెద్దల్లో ఉందట.ఇతర అంశాలు తమ పార్టీ ట్రెండ్స్‌ను బైపాస్ చేస్తున్నాయన్న అభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది. రాజకీయ ప్రత్యర్థులు కావాలనే వేరే అంశాలను స్ట్రీమ్‌లైన్‌లోకి తీసుకువచ్చి తమకు రావాల్సిన మైలేజ్‌ను తగ్గిస్తున్నారన్న క్లారిటీకి వచ్చింది ఫ్యాన్ అధినాయకత్వం. అందుకే ఇక కేవలం సభలు, సమావేశాలతోనే సరిపెట్టకుండా టెక్నాలజీ సపోర్ట్‌తో సరికొత్త గేమ్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. దానిపేరే జగనన్న టెక్‌ఫోర్స్ ప్రోగ్రాం. సాధారణ పార్టీ కార్యకర్తలు, పార్టీకి కోర్ సింపతైజర్స్‌గా ఉంటే ఐటీ ప్రొఫెషనల్స్‌ను ఒకే తాటిపైకి తీసుకురావడమే ఈ ప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశం. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డిజిటల్ నిపుణులను ఈ కార్యక్రమంలోకి ఆహ్వానించి వారి నైపుణ్యాన్ని పార్టీ కోసం వాడుకునేలా పక్కా రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది.దానిద్వారా సోషల్ మీడియాలో పార్టీ ప్రజెన్స్‌ను పెంచడమే కాకుండా ప్రత్యర్థుల ఆరోపణలను తిప్పికొట్టడం, అదే టైంలో? వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన మంచి పనుల్ని కూడా జనంలోకి తీసుకువెళ్ళాలన్న బహుళ లక్ష్యాలను నిర్దేశించుకున్నట్టు తెలుస్తోంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే వైసీపీని డిజిటల్‌గా మరింత బలోపేతం చేయాటమే జగనన్న టెక్‌ఫోర్స్ లక్ష్యం. దానికి సంబంధించి ఎలాంటి ముందస్తు హడావిడి చేయకూడదని నిర్ణయించుకున్నారట. స్టార్ట్ అయినప్పటికంటే?.రిజల్ట్ వచ్చినప్పుడు ప్రోగ్రాం పేరు బయటకు రావాలనే కాన్సెప్ట్‌తో సైలెంట్ మోడ్‌లో ఆపరేషన్ మొదలుపెట్టినట్టు పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

ఫీల్డ్ లెవల్‌లో ప్రతి మండలానికి ఒక టెక్ వాలంటీర్‌ను నియమించి.. గ్రౌండ్ నుంచి కేడర్‌కు డిజిటల్ సపోర్ట్ అందించేలా ప్లాన్ సిద్ధం చేశారు. ఆన్ లైన్ రిప్యుటేషన్ మేనేజ్మెంట్?ద్వారా సోషల్ మీడియాలో పార్టీ ఇమేజ్‌ను ఎప్పటికప్పుడు మానిటర్ చేయడం, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ చేసి వైసీపీకి సంబంధించిన పాజిటివ్ నేరేటివ్ అందరి కంటే ముందు ఉండేలా ప్లాన్ చేయడం ఈ ప్రోగ్రాం ప్రధాన అజెండా.

అందుకే ప్రతి మండలం నుంచి యాక్టివ్‌గా ఉండేలా సాఫ్ట్ వేర్ ఇంజనీర్స్‌ను కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయాలని భావిస్తోంది వైసీపీ.ఈ ప్రోగ్రాంకు సంబంధించి క్యూఆర్ కోడ్ రిజిస్ట్రేషన్లు మొదలయ్యాయి. ఇప్పటికే వెబ్‌సైట్లు, క్యూఆర్ కోడ్‌ల ద్వారా భారీ సంఖ్యలో టెక్ వారియర్లను ఆన్‌బోర్డ్ చేస్తోంది..

క్షేత్రస్థాయిలో కేడర్‌కు ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే ఈ టెక్ ఫోర్స్ రియాక్ట్ అయ్యి వారికి డిజిటల్ సపోర్ట్ అందిస్తుందట. ఒకవైపు గ్రౌండ్ ఫోర్స్ పని చేస్తుంటే.. మరోవైపు ఈ టెక్నో వారియర్స్ ఆన్‌లైన్‌లో పార్టీకి మద్దతుగా పోరాడతారు.

డిజిటల్ యుగంలో మారుతున్న రాజకీయ సమీకరణలకు అనుగుణంగా వైసీపీ తీసుకున్న ఈ నిర్ణయం రాబోయే రోజుల్లో గేమ్ ఛేంజర్ అవుతుందా? సోషల్ మీడియాలో పట్టు పెరుగుతుందా అన్న చర్చలు నడుస్తున్నాయి రాజకీయవర్గాల్లో

# అనంతలో యుద్ధవిమానాలు తయారీ

అనంతపురం మే 5 ఏపీకి మరో గుడ్ న్యూస్ అందింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు డిఆర్డిఓ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రక్షణ రంగంతో పాటు ఏరోస్పేస్ లో ముద్ర చాటుకోనుంది ఏపీ. సత్యసాయి జిల్లాలో ఈ పరిశ్రమ ఏర్పాటు కానుంది. సీఎం చంద్రబాబు ఈ పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్నారు. యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమయింది. బెంగళూరుకు అతి సమీపంలో సత్యసాయి జిల్లా ఉండడం కలిసి వచ్చే అంశం. రక్షణ రంగంలో భారీ ప్రాజెక్టు జిల్లాకు కేటాయించడం అనేది విశేషమే. ఈ పరిశ్రమ ఏర్పాటుతో జిల్లా కూడా అభివృద్ధి చెందనుంది. ఉద్యోగ ఉపాధి అవకాశాలు మరింతగా మెరుగు పడనున్నాయి.శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి లో15వేల కోట్ల రూపాయల పెట్టుబడితో ఈ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నారు. ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాలు ఇక్కడ తయారు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ ఇక్కడ ప్రాజెక్టు ఏర్పాటుకు ముందుకు వచ్చింది. సీఎం చంద్రబాబు ఈనెల ఈ పరిశ్రమకు సంబంధించి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు రాకతో దేశంలో రక్షణ రంగం చిత్రపటంలో శ్రీ సత్య సాయి జిల్లాకు చోటు దక్కనుంది. దేశీయంగా అత్యాధునికంగా యుద్ధ విమానాలను ఇక్కడ తయారు చేయనున్నారు. రక్షణ రంగాలకు సంబంధించి ఇండియన్ ఎయిర్ ఫోర్స్, ఇండియన్ ఆర్మీ తోపాటు నావి ఈ యుద్ధ విమానాలను వినియోగించుకోనున్నాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న సుఖోయ్ ఎస్ యు–30 యుద్ధ విమానాలకు ప్రత్యామ్నాయంగా ఇక్కడ అత్యాధునిక విమానాలను తయారు చేయనున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు కోసం 600 ఎకరాల భూమిని డిఆర్డిఓకు కేటాయించింది రాష్ట్ర ప్రభుత్వం. అవసరార్థం మరో నాలుగు వందల ఎకరాలను అందుబాటులో ఉంచింది. 2029 నాటికి తొలి విమానాన్ని ఆవిష్కరించాలన్నది లక్ష్యం. 2035 నాటికి పూర్తిస్థాయిలో విమాన తయారీ ఉత్పత్తులను అందుబాటులోకి తేవాలన్నది టార్గెట్.శ్రీ సత్య సాయి జిల్లాలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు అవుతుండడం శుభపరిణామం. ముఖ్యంగా రక్షణ శాఖతోపాటు ఏరోస్పేస్ రంగానికి హబ్ గా మారుతోంది జిల్లా. ఇప్పటికే పాలసముద్రం సమీపంలో 500 కోట్ల రూపాయల పెట్టుబడితో భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ 1000 ఎకరాల్లో డిఫెన్స్ సిస్టం ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేసింది. అలాగే మడకశిరలో కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టం లిమిటెడ్ 2500 కోట్ల రూపాయలతో.. వెయ్యి ఎకరాల్లో డిఫెన్స్ ఎనర్జిటిక్ తయారీ కాంప్లెక్స్ ను నిర్మించనుంది. ఇప్పుడు డిఆర్డిఓ ఏకంగా యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు సిద్ధపడుతుండడంతో.. రాయలసీమ.. అందులోనూ శ్రీ సత్యసాయి జిల్లా రక్షణ రంగం లో హబ్ గా మారనుందన్నమాట.

## కరీంనగర్ లోని ఖాజీపూర్ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడిన కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ వడ్ల కొనుగోలు కోసం పడిగాపులు కాస్తున్నామని వాపోయిన రైతులుతాలు, తరుగు పేరుతో బస్తాకు నాలుగైదు కేజీలు దోచుకుంటున్నారని వాపోయిన రైతులు.అనంతరం మీడియాతో కేంద్ర మంత్రి ఏమన్నారంటే:ఇంకెంతమందిని బలి కొంటారురైతులు చస్తున్నా వడ్లను కొనుగోలు చేయరా,కొనుగోలు కేంద్రాలవద్ద అరిగోస పడుతున్నా స్పందించరాప్రతి గింజకు కేంద్రమే పైసలిస్తుంటే కొనడానికి మీకున్న ఇబ్బందేమిటి?వడ్లు కొన్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కమీషన్ కూడా ఇస్తున్నాం కదావడ్ల కొనుగోలు కేంద్రాలకు వెళితే మంత్రులను రైతులు కొట్టేటట్లు ఉన్నారు.రైతులను నట్టేట ముంచారుచేతికి పంట వచ్చేదాకా ఒక టెన్షన్ చేతికొచ్చాక అమ్ముకోవడానికి పడిగాపులు కాయాలా?90 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు వస్తే ఇప్పటిదాకా 15 లక్షల మెట్రిక్ టన్నులే కొంటారాకొనుగోలు కేంద్రాలవద్ద టోకెన్లు ఇవ్వడానికి కూడా కమీషన్లు దండుకుంటున్న దుర్మార్గులు.తాలు, తరుగు, తేమ పేరుతో అడ్డగోలుగా దోచుకుంటున్నారురైతుల కష్టాన్ని దళారులు దోచుకుంటున్నా స్పందించరా?వాస్తవాలు మాట్లాడితే మాపై ఎదురు దాడి చేస్తారాకాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేస్తోందిఫీజు రీయంబర్స్ మెంట్ కూడా ఇయ్యలేక ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాల విద్యార్థులభవిష్యత్తునుదెబ్బతీస్తారా?కేంద్ర ఎస్టీ విద్యార్థుల రీయంబర్స్ మెంట్ కోసం నిధులు మంజూరు చేసినా వాడుకోలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ ది..

# సర్కారీ స్కూళ్లపై టీడీపీ పబ్లిక్ స్టంట్

గుంటూరు మే 5 జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు.. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టామని వైసిపి గొప్పగా చెప్పుకుంది. తన అనుకూల మీడియాలో గొప్పగా రాసుకుంది. ఓ పాఠశాల విద్యార్థులతో ఇంగ్లీష్ పాఠాలను బట్టి పట్టించి.. జగన్ ముందు వల్లె వేయించింది. ఆ విద్యార్థులు మాట్లాడే తీరు.. వ్యవహరిస్తున్న తీరు ఒక రకంగా పిఆర్ స్టంట్ లాగా అనిపించింది. నిజానికి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఇంగ్లీష్ మాట్లాడడం మంచిదే. కాకపోతే ఏదో మొక్కుబడి వ్యవహారం లాగా దానిని మార్చడమే అసలైన ఇబ్బంది. వైసిపి దానిని చేసింది. దాని వెనుక ఉన్న అసలు కోణాన్ని నాడు టిడిపి బయట పెట్టింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో విద్యా వ్యవస్థను పూర్తిగా గాడిలో పెట్టేందుకు లోకేష్ ప్రణాళికలు రూపొందించారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి లేకుండా.. స్వేచ్ఛాయుత వాతావరణంలో పని చేసేలా ప్రణాళికలు రూపొందించారు. మెరుగైన ఫలితాలు సాధ్యం కావాలని వారికి పదే పదే చెప్పేవారు. అలాగని బండెడు చాకిరి చేయాలని అనేవారు కాదు. అందువల్లే ఏపీలో ఈసారి పది ఫలితాలు రికార్డు స్థాయిలో వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అంతకుమించి అనే స్థాయిలో మార్కులు సాధించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులకు నిదర్శనంగా నిలిచారు.ఆమధ్య ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మాక్ అసెంబ్లీ నిర్వహించింది. కొంతమంది విద్యార్థులను ఈ కార్యక్రమానికి ఎంపిక చేసింది అందులో కొంతమంది విద్యార్థులు ఎమ్మెల్యేలుగా.. ప్రతిపక్ష పార్టీకి సంబంధించిన నాయకులుగా.. ముఖ్యమంత్రిగా.. మంత్రులుగా వ్యవహరించారు. మాక్ అసెంబ్లీలో స్పీకర్ పాత్రలో నటించిన స్వాతి ఇటీవల టెన్త్ ఫలితాలలో టాప్ ర్యాంక్ సాధించింది. ఆమె ఏకంగా 594 మార్కులు పొందింది. ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరించిన వీర ఉదయశ్రీ 592 మార్కులు సాధించింది. ప్రతిపక్షపాత్రలో నటించిన సౌమ్య 571 మార్కులు పొందింది. ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా వ్యవహరించినవారు 580 కి పైగా మార్కులు సాధించారు. ఇదంతా కూడా నారా లోకేష్ ముందు చూపుకు నిదర్శనం. ఎందుకంటే పాఠశాలలోనే దేశ భవిష్యత్తు నిర్మితమవుతుంది. పాఠశాలలోనే విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి వస్తుంది. దీనిని పూర్తిగా నమ్మిన లోకేష్.. అద్భుతమైన ప్రణాళికలు రూపొందించారు

. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చారు. అందువల్లే ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు 10 ఫలితాలలో అద్భుతమైన ఫలితాలను సాధించారు. ఇటువంటి పనులు వైసిపికి చేతకావు. ఆ పార్టీ చేయలేదు కూడా..

# బీజేపిని గెలిపించిన పన్నాప్రముఖ్...

కోల్ కత్తా, మే 5, పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనం నమోదైంది. గత 15 ఏళ్లుగా తిరుగులేని శక్తిగా ఉన్న మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ కంచుకోటను భారతీయ జనతా పార్టీ బద్ధలు కొట్టింది. 2021 నాటి వైఫల్యాల నుంచి గుణపాఠాలు నేర్చుకున్న బీజేపీ, అమిత్ షా నేతృత్వంలో పక్కా వ్యూహంతో ముందుకు సాగి ఈ చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది.గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో కోల్పోయిన స్థానాలపై ఈసారి బీజేపీ ప్రత్యేక దృష్టి సారించింది. అమిత్ షా కనుసన్నల్లో సునీల్ భన్సల్, భూపేంద్ర యాదవ్ వంటి వ్యూహకర్తలు క్షేత్రస్థాయిలో 'పన్నా ప్రముఖ్' వ్యవస్థను బలోపేతం చేశారు. ప్రతి 10-15 కుటుంబాలకు ఒక కార్యకర్తను కేటాయించి, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించడంలో సఫలమయ్యారు. దీనివల్ల రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 92 శాతం పోలింగ్ నమోదై, అది బీజేపీకి భారీగా కలిసొచ్చింది.ఈసారి బీజేపీ నేరుగా మమతా బెనర్జీని లక్ష్యం చేసుకోకుండా, స్థానిక ఎమ్మెల్యేల అవినీతిని ఎండగట్టింది. 220 నియోజకవర్గాల్లో టీఎంసీ నేతలపై 'ఛార్జిషీట్లు' విడుదల చేసి ప్రజల్లోకి తీసుకెళ్లింది. దీనికి తోడు ఆర్జీ కర్ ఆస్పత్రి ఘటన, శాంతిభద్రతల వైఫల్యం, బంగ్లాదేశ్ చొరబాట్ల వంటి అంశాలను ప్రచార అస్త్రాలుగా మలుచుకుంది. ఆర్జీ కర్ ఆస్పత్రి వైద్యురాలి తల్లికి టికెట్ కేటాయించడం ఓటర్లను ఆలోచింపజేసింది.

మహిళలు, రైతుల మనసు గెలిచిన మేనిఫెస్టో..

ప్రతి మహిళకు నెలకు రూ. 3,000 ఆర్థిక సాయం.

ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్.

వరి క్వింటాల్‌కు రూ. 3,100 మద్దతు ధర.

యువతకు నెలకు రూ. 3,000 నిరుద్యోగ భృతి.

ఎన్నికల వేళ ఈసీ తీసుకున్న నిర్ణయాలు కూడా టీఎంసీకి ఇబ్బందికరంగా మారాయి. సుమారు 2.4 లక్షల మంది కేంద్ర బలగాలను మోహరించడంతో హింసాత్మక ఘటనలకు అడ్డుకట్ట పడింది. ఉత్తర బెంగాల్‌లోని రాజబోంగ్షీల సమస్యలను అమిత్ షా స్వయంగా పర్యవేక్షించి అక్కడి స్థానాలను కైవసం చేసుకున్నారు.సువేందు అధికారి వంటి స్థానిక నేతలను ముందుంచి, అమిత్ షా స్వయంగా 66 ర్యాలీలతో బెంగాల్ అంతటా పర్యటించి కేడర్‌లో ఉత్సాహం నింపారు. ఫలితంగా దశాబ్దన్నర కాలం తర్వాత బెంగాల్ గడ్డపై కాషాయ జెండా రెపరెపలాడింది.అమిత్‌షానే స్వయంగా 152కు పైగా నియోజకవర్గాల్లోని 44,000 పోలింగ్ కేంద్రాల పరిధిలో జరిగిన సమావేశాలను పర్యవేక్షించారంటే బీజేపీ ఏ స్థాయిలో దృష్టిపెట్టిందో అర్థం చేసుకోవచ్చు.శాంతిభద్రత, సరిహద్దుల రక్షణ విషయంలో తనదైన శైలిలో ప్రచారం చేశారు అమిత్ షా. పార్టీ అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే 100% కంచె నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించారు

భూపేంద్ర యాదవ్?

బంగాల్? గెలుపులో కీలక పాత్ర పోషించిన మరో వ్యక్తి కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్?. ఎన్నికల నేపథ్యంలో గతేడాది బంగాల్? ఇంఛార్జ్?గా కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్?ను నియమించింది అధిష్ఠానం. సంస్థాగత వ్యవహారాలు, సమన్వయం చేయడంలో తెర వెనుక ఎంతో కష్టపడ్డారు. అభ్యర్థుల ఎంపిక నుంచి కూటమి ఏర్పాటు వరకు పాలుపంచుకున్నారు. ముఖ్యంగా గెలుపు గుర్రాలను గుర్తించి, తక్కువ ప్రభావం ఉన్న ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేశారు. ఎన్నికల నిర్వహణలో కూడా భూపేంద్ర యాదవ్? కీలక పాత్ర పోషించారు.

శామిక్ భట్టాచార్య

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు శామిక్ భట్టాచార్య ఆ పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించారు. కార్యకర్తలు, నేతల మధ్య సమన్వయంతో పాటు వ్యూహాలను అమలు చేశారు. అభ్యర్థుల ఎంపిక, బూత్? స్థాయి సన్నద్ధత, పార్టీ సంస్థాగత వ్యవస్థ పనితీరు విషయంలో సాయం అందించారు. అటు అమిత్ షా లాంటి నేతల ప్రసంగాలను స్థానిక బంగాలీలోకి అనువాదం చేస్తూ పార్టీ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

సువేందు అధికారి

ఒకప్పుడు మమతా బెనర్జీకి అత్యంత విశ్వసనీయుడిగా ఉన్న సువేందు అధికారి, బంగాల్?లో బీజేపీ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఆయన దూకుడు ప్రచారం, అవినీతి, రాజకీయ హింస వంటి సమస్యలపై దృష్టి పెట్టడం, కీలక ఓటు బ్యాంకులను ఏకీకృతం చేయడానికి కృషి చేశారు. ఇంకా గత ఐదేళ్ల కాలంలో ప్రతిపక్ష నాయకుడిగా, అధికార టీఎంసీపై ఒత్తిడిని కొనసాగిస్తూ, క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమీకరించారు. సువేందు కేవలం ప్రచారకర్తగానే కాకుండా, బీజేపీ జాతీయ నాయకత్వానికి- బంగాల్ స్థానిక రాజకీయ వాస్తవాలకు మధ్య వారధిగా నిలిచారు.తృణమూల్ కాంగ్రెస్? బలాలు, బలహీనతలు తెలిసి ఉన్న వ్యక్తి సువేందు అధికారి. దీనికి ప్రధాని మోదీ, అమిత్ షాల సహకారం తోడు కావడంతో ఆయన బీజేపీని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విజయం సాధించారు. తూర్పు మేదినీపూర్, నందిగ్రామ్‌లో సువేందు కుటుంబానికి బలమైన పట్టు ఉంది. 2026 ఎన్నికల్లో కూడా ఆయన నందిగ్రామ్‌తో పాటు మమతా బెనర్జీ బరిలో దిగిన భవానీపూర్ నుంచి పోటీ చేశారు. మమతా బెనర్జీ తరహాలోనే ఆయన తన పోరాట పంథా కొనసాగించారు. చొరబాట్లను వ్యతిరేకిస్తూనే ఈ విషయంలో టీఎంసీ ప్రభుత్వ వైఖరిని అనేక సందర్భాల్లో ఎండగట్టారు. ఈ ఎన్నికల్లో బీజేపీ విజయంలో కీలక పాత్ర పోషించి సీఎం పదవికి ప్రధాన పోటీదారుగా నిలిచారు. 2006లో తొలిసారి కాంథీ దక్షిణ్ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన, 2009, 2014లలో తమలుక్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు

# నల్లాల దగ్గర అర్ధరాత్రి నిరీక్షణలు

హైదరాబాద్, మే 5 భానుడి భగభగలకు నగరం విలవిలలాడుతోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు తోడు తాగునీటి కొరత తోడవడంతో సామాన్యుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. నగరానికి నీటిని అందించే ప్రధాన జలాశయాల్లో నిల్వలు వేగంగా పడిపోతుండటమే ఈ దుస్థితికి ప్రధాన కారణం.నగర దాహార్తిని తీర్చే నాగార్జునసాగర్, ఎల్లంపల్లి వంటి జలాశయాల్లో నీటి నిల్వలు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయి.నాగార్జునసాగర్‌లో పూర్తి స్థాయి సామర్థ్యం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 160 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఎల్లంపల్లిలో ఇక్కడ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. 20 టీఎంసీల సామర్థ్యానికి గాను నిల్వలు 9 టీఎంసీలకు పడిపోయాయి. మే నెలలో ఈ మట్టాలు మరిన్ని కనిష్ఠ స్థాయికి పడిపోయే ప్రమాదం ఉండటంతో జలమండలి అత్యవసర పంపింగ్ చర్యలకు సిద్ధమవుతోంది.సాధారణంగా రోజు విడిచి రోజు రావాల్సిన నీరు, ఇప్పుడు మూడు నాలుగు రోజులకోసారి సరఫరా అవుతోందని పలు ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. సరఫరా అయ్యే కొద్ది సమయం కూడా నీటి ఒత్తిడి (ప్రెషర్) తక్కువగా ఉండటంతో బిందెలు నిండటానికి గంటల కొద్దీ వేచి చూడాల్సి వస్తోంది. సీతాఫల్‌మండి, డీబీఆర్ లేన్ వంటి ప్రాంతాల్లో ప్రజలు నిద్ర మానుకొని అర్ధరాత్రి వేళ నీటి కోసం వీధుల్లో ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.ఒకవైపు నీటి కొరత వేధిస్తుంటే, మరోవైపు పాతబస్తీ, ఖైరతాబాద్, అమీర్‌పేట వంటి ప్రాంతాల్లో పైపులైన్ల లీకేజీల కారణంగా మురుగు నీరు కలిసి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నల్లా వదిలిన మొదటి 15-20 నిమిషాల పాటు కలుషిత నీరు వస్తుండటంతో, వాటిని వదిలేయడం వల్ల భారీగా నీరు వృథా అవుతోంది.నల్లా నీరు సక్రమంగా అందకపోవడంతో ప్రజలు ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. దీనివల్ల ఖర్చులు పెరగడమే కాకుండా, ట్యాంకర్ల కోసం కూడా రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. నగరవ్యాప్తంగా సుమారు 14.43 లక్షల కనెక్షన్ల ద్వారా ప్రతిరోజూ 2,647 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం జనం దాహార్తి తీరడం లేదు.ఖైరతాబాద్, బేగంపేట, ముషీరాబాద్, చందానగర్, కూకట్‌పల్లి సహా దాదాపు అన్ని ప్రధాన ప్రాంతాల్లో నీటి కష్టాలు తీవ్ర రూపం దాల్చాయి. అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

## పార్కింగ్ రుసుము అడిగినందుకు సిబ్బందిని ఢీ కొట్టుకుంటూ వెళ్లిన కారు యజమాని. అనంతరం సిబ్బందిపై దాడి

మచిలీపట్నం వరం సెంట్రల్ మాల్ వద్ద పార్కింగ్ రుసుము వివాదంకు దారి తీసింది. పార్కింగ్ చార్జీలు చెల్లించాలని సిబ్బంది కోరిన నేపథ్యంలో కారు యజమాని ఆగ్రహానికి లోనై సిబ్బందిపై దాడికి పాల్పడ్డాడు..సేకరించిన సమాచారం ప్రకారం, మాల్‌కు వచ్చిన తెలంగాణ రిజిస్ట్రేషన్ కారు యజమానిని పార్కింగ్ సిబ్బంది విధి ప్రకారం రుసుము చెల్లించాలని కోరారు. అయితే దీనిపై ఆగ్రహించిన ఆ వ్యక్తి వాగ్వాదానికి దిగడమే కాకుండా, అక్కడే ఉన్న సిబ్బందిని ఢీ కొట్టి వెళ్లిపోయాడు. అనంతరం గేటు వద్ద కారును సిబ్బంది అడ్డుకున్నారు. నా కారునే అడ్డుకుంటారా? అని కారు యజమాని సిబ్బందిపై దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ప్రజల తిరిగి నడిరోడ్డుపై జరగటం గమనార్హం... సిబ్బందిపై దాడి చేసిన కారు యజమాని పై వరం సెంట్రల్ మాల్ యాజమాన్యం చిలకపూడి పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

# బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధి నిజాంపేట్లో అగ్నిప్రమాదం

## 6 ఫర్నిచర్ దుకాణాలు పూర్తిగా దగ్ధం...



హైదరాబాద్ బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజాంపేట్ సర్కిల్ లో అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సుమారు 6 ఫర్నిచర్ దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. షాపుల్లో నిల్వ ఉంచిన ఫర్నిచర్ సామగ్రి పూర్తిగా దగ్ధమై లక్షల రూపాయల నష్టం జరిగింది...సమాచారం అందుకున్న వెంటనే 4 అగ్నిమాపక యంత్రాలు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు కలిసి సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవలే ఇదే ప్రాంతంలో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న నేపథ్యంలో మళ్లీ ఇలాంటి ఘటన జరగడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడం ఉపశమనంగా మారింది. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# నిన్న తెలంగాణ... ఇవాళ తమిళనాడు.. బీజేపీని దెబ్బ తీసిన సంస్థాగత మార్పులు

న్యూఢిల్లీ, మే 5, (న్యూస్ పల్స్) తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న వేళ సోషల్ మీడియాలో ఓ పోస్టు ఆసక్తికరంగా మారింది. ఎన్నికలకు ముందు బీజేపీ తమ రాష్ట్ర అధ్యక్షుణ్ని మారిస్తే.. ఆ రాష్ట్రంలో అధికార మార్పు జరుగుతుందనేది ఈ పోస్టు సారాంశం. ఇంతకు ముందు తెలంగాణలో, ఇప్పుడు తమిళనాడులో ఇదే జరిగిందని చెబుతున్నారు.2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలంగాణ లో బండి సంజయ్ సారథ్యంలోని బీజేపీ దూకుడు మీద ఉంది. కానీ ఎన్నికలకు ఆరు నెలల ముందు 2023 జులై 4న సంజయ్‌ను పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించారు. ఆయన స్థానంలో కిషన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. బండిని తప్పించిన తర్వాత తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ వేగంగా పడిపోయింది. అప్పటి వరకూ బీఆర్ఎస్‌తో ఢీ అంటే ఢీ అన్నట్టుగా వ్యవహరించి.. రెండో స్థానంలో ఉన్నట్టు కనిపించిన కమలం పార్టీ వేగంగా కిందకు జారింది. దీంతో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితమైంది. తెలంగాణలో బండి సంజయ్‌ను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పించడం అప్పట్లో చాలా మందిని ఆశ్చర్యపరిచింది.తమిళనాడులోనూ ఇదే తరహాలో బీజేపీ వ్యవహరించింది. తమిళనాట బీజేపీ పుంజుకోవడానికి శక్తికి మించి శ్రమిస్తోన్న అన్నామలైను.. 2026 ఏప్రిల్‌లో పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించింది. ఆయన స్థానంలో నైనార్ నాగేంద్రన్‌ను నూతన అధ్యక్షుడిగా నియమించింది. అన్నాడీఎంకేతో పొత్తు కోసమే అన్నామలైను అధ్యక్ష పదవి నుంచి తప్పించారని ప్రచారం జరిగింది. అన్నామలై విషయంలో పళనిస్వామి సౌకర్యంగా లేకపోవడం వల్లే ఈ మార్పు జరిగిందని చెబుతారు. దీనికి తగ్గట్టుగానే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో టీవీకే విజయం ఖాయమైన వేళ.. అన్నామలై వేసిన ట్వీట్‌లో పళనిస్వామి ప్రస్తావన తీసుకురాలేదు.ఐపీఎస్ అధికారి అయిన అన్నామలై.. ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారు. దూకుడుగా వ్యవహరిస్తూ తమిళనాడులో బీజేపీకి మంచి గుర్తింపు తీసుకొచ్చారు. అలాంటి నేతను ఎన్నికల ముందు అధ్యక్ష పదవి నుంచి తప్పించడం బీజేపీ శ్రేణులను సైతం ఆశ్చర్యపరిచింది.తీరా చూస్తే తమిళనాడులోనూ అధికార మార్పిడి జరిగింది. డీఎంకే కూటమి అనూహ్యంగా భంగపాటుకు గురైంది. డీఎంకే ఓటమికి, బీజేపీ అధ్యక్ష మార్పుకు సంబంధం ఉందని చెప్పలేం. కానీ ఎన్నికల ముంగిట తెలంగాణతోపాటు తమిళనాడులోనూ బీజేపీ అధ్యక్షుణ్ని మార్చడం.. అధికార పార్టీలు ఇంటి ముఖం పట్టడానికి కారణమైంది.

# విజయ్ కు అంత ఈజీ కాదు... ముందున్న మొసళ్ల పండుగ



చెన్నై, మే 5, (న్యూస్ పల్స్) విజయ్ పార్టీ గెలిచింది. తను కూడా రెండు స్థానాలలో పోటీచేసి గెలిచాడు. అతిపెద్ద పార్టీగా అవతరించి.. అధికారంలోకి రాగలిగాడు. ఒక మంచి రోజు చూసుకొని తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తాడు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి 6 నెలలపాటు హనీమూన్ పీరియడ్ ఉంటుంది. ఆ తర్వాత అసలు సవారి మొదలవుతుంది. ప్రతిపక్షాలు అప్పటిదాకా ఎదురుచూస్తాయి. ఆ తర్వాత విమర్శలు మొదలు పెడతాయి. రాజకీయం అంటేనే అలా ఉంటుంది కదా.. అప్పటిదాకా విజయ్ ని అభిమానించిన వారు విమర్శలు చేస్తారు. ఏక వాక్యంతో సంబోధిస్తారు. అవసరమైతే వ్యక్తిగత విషయాలను కూడా లాగుతారు. పైగా తమిళనాడు రాజకీయాలు అత్యంత దారుణంగా ఉంటాయి.విజయ్ ఎన్నికల ప్రచారంలో తమిళ ప్రజలకు అనేక హామీలు ఇచ్చారు.. మహిళలకు ప్రతినెల 2500 ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. పెళ్ళికానుకగా వధువుకు ఎనిమిది గ్రాముల బంగారం, పట్టుచీర ఇస్తామని వెల్లడించారు. ఉద్యోగాలు లేని గ్రాడ్యుయేట్లకు ప్రతినెల 4000 రూపాయల భృతి ఇస్తామని వెల్లడించారు. దివ్యాంగులకు, వృద్ధులకు ప్రతినెల 3000 పింఛన్ ఇస్తామని చెప్పారు. ఏడాదికి ఆరు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని పేర్కొన్నారు. గృహాలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. కొత్తగా 5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదువుకోవడానికి విద్యార్థులకు 20 లక్షల వరకు రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఐదు లక్షల మందికి పెయిడ్ ఇంటర్న్ షిప్ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. స్కూల్ కి వెళ్లే పిల్లలు ఉన్న తల్లులకు ప్రతి ఏడాది 15000 చొప్పున ఇస్తామని ప్రకటించారు. ఐదు ఎకరాలకు పంట భూములు ఉన్న రైతులకు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని విజయ్ హామీ ఇచ్చారు.ఈ హామీలు తమిళ ప్రజలను విజయ్ వైపు చూసేలా చేశాయి. తమిళనాడులో సంక్షేమ పథకాలు అమలు చేయడంలో రాజకీయ పార్టీ నాయకులు సరికొత్త విధానాన్ని అవలంబిస్తారు. గతంలో కరుణానిధి, జయలలిత ఓటర్లకు టీవీలు, కుక్కర్లు, వాషింగ్ మిషన్లు కూడా ఇచ్చారు. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రజలను సోమరులను చేయడానికి తమిళనాడు నాయకులు గట్టిగానే కంకణం పట్టుకున్నారు. విజయ్ హామీ ఇచ్చినట్టుగా తమిళ ప్రజలకు ఆ పథకాలు మొత్తం అమలు కావాలంటే లక్షల కోట్ల బడ్జెట్ కావాలి.తమిళనాడు పెద్ద రాష్ట్రం. మన దేశానికి ఆర్థికంగా బలమైన సపోర్ట్ ఇస్తున్న రాష్ట్రాలలో ముందు వరుసలో ఉంటుంది. కాకపోతే తమిళనాడు ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం ఏమాత్రం బాగోలేదు. తమిళనాడు రాష్ట్రానికి సంబంధించి 2024 ,25 ఆర్థిక సంవత్సరానికి గాను స్థూల రాష్ట్ర దేశ ఉత్పత్తి 31.55 లక్షల కోట్లుగా ఉంది. 2025,26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీఎస్డీపీ శాతం 35,67,818 కోట్లుగా ఉంది.. రాష్ట్ర బడ్జెట్లో (మూడు శాతం) ఆర్థిక లోటు 1,06,968 కోట్లుగా ఉంది. రాబడి లోటు (1.2%) 41,635 కోట్లుగా ఉంది.2025, 26 బడ్జెట్ అంచనా వ్యయం 4,39,293 కోట్లుగా ఉంది.. రాబడి లోటు, ఆర్థిక లోటు స్పష్టంగా కనిపిస్తున్న నేపథ్యంలో.. విజయ్ తన ముందు ఉన్న సవాళ్ళను ఎలా ఎదుర్కొంటారో చూడాల్సి ఉంది. రాష్ట్ర వనరుల నుంచి 75.3, కేంద్ర పన్నులు, గ్రాంట్ల నుంచి 24.7 శాతం రాబడిని తమిళనాడు ప్రభుత్వం అంచనా వేసింది. అయితే ఇది ఆచరణలో సాధ్యమయ్యే అవకాశం కనిపించడం లేదు.

# జూన్ 2 లోపు కేబినెట్ విస్తరణ

హైదరాబాద్, మే 5 తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రెండున్నరేళ్లు పూర్తవుతున్న తరుణంలో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. పరిపాలనలో వేగం పెంచడం, రాబోయే సవాళ్లను ఎదుర్కోవడం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించేందుకు సిద్ధమవుతున్నారు. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం కనిపిస్తోంది.అందుతున్న సమాచారం ప్రకారం మంత్రివర్గంలో ముగ్గురు కొత్త వాళ్లకు చోటు దక్కే అవకాశం కనిపిస్తోంది. ఇందులో ఖాళీగా ఉన్న ఒక స్థానంతో పాటు, పనితీరు సరిగా లేని ఇద్దరు మంత్రులను తప్పించి వారి స్థానాలను భర్తీ చేయాలని అధిష్ఠానం భావిస్తోంది. ముఖ్యంగా ప్రజలతో నేరుగా సంబంధం ఉండే కీలక శాఖల మంత్రుల పనితీరుపై ఇప్పటికే హైకమాండ్ నివేదికలు

తెప్పించుకుంది. కొన్ని ప్రతిష్ఠాత్మక హామీల అమలులో వెనుకబడిన శాఖల బాధ్యతలను సమర్థులకు అప్పగించేలా భారీ మార్పులు జరగనున్నాయి.కేబినెట్ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అంశం మరోసారి చర్చకు వచ్చింది. తనకు మంత్రి పదవి ఇస్తామని గతంలో హైకమాండ్ హామీ ఇచ్చిందని ఆయన పదేపదే చెప్తున్నారు. అయితే, ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి ఇప్పటికే తన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రులుగా ఉన్నారు. దీంతో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఈసారి కేబినెట్ లో చోటు దక్కుతుందా లేదా అనేది ఆసక్తి రేపుతోంది. అయితే కోమటిరెడ్డి సోదరుల్లో ఒకరికే అవకాశం అనే నిబంధనను అధిష్ఠానం తెరపైకి తెచ్చినట్లు సమాచారం. ఒకవేళ రాజగోపాల్‌రెడ్డికి చోటు కల్పించాల్సి వస్తే, వెంకట్‌రెడ్డిని కేబినెట్ నుంచి తప్పించే అవకాశం ఉంది. పైగా సీఎం రేవంత్ రెడ్డితో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి గ్యాప్ వచ్చినట్లు సమాచారం.మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు ఉండబోతున్నాయని తెలియగానే పలువురు సీనియర్లు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఎస్టీ కోటాలో మహబూబాబాద్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్, బాలూ నాయక్ మధ్య పోటీ నెలకొంది. బీసీ కోటాలో మున్నూరు కాపు వర్గం నుండి ఆది శ్రీనివాస్ పేరు వినిపిస్తోంది. ఇక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ కూడా మంత్రివర్గంలో చోటుకోసం ప్రయత్నిస్తున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సైతం కేబినెట్ లోకి వెళ్లాలని ఆశిస్తున్నట్టు సమాచారం.కేవలం కేబినెట్ మాత్రమే కాకుండా, టీపీసీసీలో ఖాళీగా ఉన్న కార్యనిర్వాహక అధ్యక్షుల నియామకంపై కూడా కసరత్తు జరుగుతోంది. ఎస్సీ మాదిగ వర్గం నుంచి సంపత్ కుమార్, ఎస్టీ లంబాడ వర్గం నుంచి బలరాం నాయక్ లేదా బెల్లయ్య నాయక్ ను కార్యవర్గంలోకి తీసుకునే అవకాశం ఉంది. రెడ్డి సామాజిక వర్గం నుంచి నాయిని రాజేందర్ రెడ్డి లేదా చామల కిరణ్ కుమార్ రెడ్డికి చోటు దక్కవచ్చు. మైనార్టీల నుంచి అజ్మతుల్లా, ఫహీమ్ ఖురేషీ స్థానం ఆశిస్తున్నారు. వీళ్లతో పాటు ప్రచార కమిటీ ఛైర్మన్‌గా మధుయాష్కీని కొనసాగించాలా లేదా అన్నది, కోశాధికారిగా రోహిన్ రెడ్డి నియామకం వంటి అంశాలపై త్వరలోనే స్పష్టత రానుంది.మొత్తానికి జూన్ 2 లోపు జరగబోయే ఈ మార్పులు అటు ప్రభుత్వంలోనూ, ఇటు పార్టీలోనూ కొత్త జోష్ నింపుతాయా లేక అసంతృప్తులకు దారితీస్తాయా అన్నది వేచి చూడాలి.

# మోడీ సభ నుంచి ఆపరేషన్ తెలంగాణ

హైదరాబాద్, మే 5 తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఖరారు కావడంతో రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారి తెలంగాణ గడ్డపై అడుగుపెడుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. మే 10న హైదరాబాద్ వేదికగా జరగనున్న ఈ పర్యటన కేవలం ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితం కాకుండా, రాబోయే ఎన్నికలకు శంఖారావంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.మే 10న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు బీజేపీ సర్వసన్నద్ధమవుతోంది. ఈ సభకు 'జానగ్రహ సభ' అని పేరు పెట్టింది. గత ఎన్నికల్లో సాధించిన విజయాలు, ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకోవాలనే లక్ష్యంతో ఈ పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ

సభ ద్వారా రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ పార్టీలపై నేరుగా విమర్శనాస్త్రాలు సంధించే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున జన సమీకరణ చేసి, కేడర్‌లో నూతన ఉత్తేజాన్ని నింపాలని హైకమాండ్ భావిస్తోంది.రాజకీయ సభతో పాటు, హైదరాబాద్ పరిధిలో దాదాపు రూ.7,700 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మౌలిక సదుపాయాలు, రవాణా, ఇతర ప్రజాహిత కార్యక్రమాలకు సంబంధించిన ఈ భారీ కేటాయింపుల ద్వారా తెలంగాణ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ భావిస్తోంది.ఈ ఏడాది జరగనున్న జీహెచ్‌ఎంసీ మేయర్ ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ తన అడుగులు వేస్తోంది. గత ఎన్నికల్లో అనూహ్య రీతిలో పుంజుకున్న బీజేపీ, కాంగ్రెస్‌ను మూడో స్థానానికి పరిమితం చేసి ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. ఈసారి ఎలాగైనా మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. మే 4న విడుదలయ్యే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఘనవిజయం సాధిస్తుందని ఆ పార్టీ నమ్మకంగా ఉంది. ఆ గెలుపు ఉత్సాహంతో తెలంగాణలో 'ఆపరేషన్ తెలంగాణ'ను ప్రారంభించి, దక్షిణాదిలో తన పట్టును మరింత బిగించాలని చూస్తోంది.కర్ణాటక తర్వాత దక్షిణాదిలో తెలంగాణనే తమకు అనుకూలమైన రాష్ట్రమని బీజేపీ మొదటి నుంచీ చెబుతోంది. అయితే, రాష్ట్ర పార్టీలో ఉన్న అంతర్గత విభేదాలు కొంతకాలంగా ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర నాయకత్వం నేరుగా రంగంలోకి దిగింది. వర్గపోరుకు చెక్ పెట్టి, పార్టీని బలోపేతం చేసేందుకు హైకమాండ్ ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ప్రధాని మోదీ పర్యటన ద్వారా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసి,

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునివ్వనున్నారు.మొత్తానికి మే 10న జరిగే ప్రధాని మోదీ పర్యటన తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు నాంది పలుకుతుందా? 'జానగ్రహ సభ' ద్వారా బీజేపీ తన సత్తా చాటుతుందా? అనేది ఇప్పుడు అత్యంత ఆసక్తికరంగా మారింది. ఒకవైపు అభివృద్ధి పనులు, మరోవైపు రాజకీయ ఎత్తుగడలతో తెలంగాణను కైవసం చేసుకునేందుకు కమలనాథులు వేస్తున్న స్కెచ్ ఏ మేరకు పారుతుందో వేచి చూడాలి.

# ఆ నలుగురు ఎమ్మెల్యేలకు క్లాస్

నల్గొండ, మే 5 తెలంగాణలో ప్రతిపక్షం వాయిస్ పెరుగుతోంది. మెల్లిగా యాక్టివిటీ ఎక్కువ అవుతోంది. రోజుకో అంశాన్ని ఎత్తుకుని అధికార పక్షానికి సవాల్ విసురుతోంది. కానీ? అట్నుంచి మాత్రం దీటైన రియాక్షన్ రానవడం లేదన్న అభిప్రాయం బలంగా ఉంది రాజకీయవర్గాల్లో. విపక్షం ప్రభుత్వం మీద ఎంతలా మాటల దాడి చేస్తున్నా? కాంగ్రెస్ వైపు నుంచి సరైన స్పందన ఉండటం లేదని మాట్లాడుకుంటున్నారు. రాష్ట్ర మంత్రుల నుండి మొదలుకుని?ఎమ్మెల్యేల వరకు ఎవరికి వారే మాకెందుకులే అన్నట్టు ప్రతి అంశాన్ని వదిలేస్తున్నారట. ఇదే ఇప్పుడు పెద్ద మైనస్ అవుతోందన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది.మంత్రులు గతంలో గాంధీభవన్‌కు వెళ్లి ఆ రోజుకి ప్రాధాన్యత కలిగిన అంశం మీదనో.. ప్రతిపక్షం నుండి వచ్చే ఆరోపణల మీదనో స్పందించేవారు. ప్రతిపక్షం కూడా అందుకు తగ్గట్టే ఆచితూచి వ్యవహరించేది. కానీ? ఇప్పుడు ఒకరిద్దరు తప్ప మినిస్టర్స్ వైపు నుంచి పెద్దగా రియాక్షన్ ఉండటం లేదన్నది బహిరంగంగానే మాట్లాడుకుంటున్న మాట. ఏ సమస్య వచ్చినా ఎలాంటి విషయమైనా ఎంతసేపూ?ప్రతిదానికి సీఎం రేవంత్ రెడ్డే సమాధానం చెప్పుకోవాల్సి వస్తోంది. ఇదే ఇప్పుడు చిరాగ్గా మారుతోందట. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఎంపీ చామల, ప్రభుత్వ విప్‌లు వెంకట్, వేముల వీరేశం, ఆది శ్రీనివాస్ లాంటి వాళ్ళు తప్ప బయటకు వచ్చి మాట్లాడేందుకు మిగతా ఎవరికీ మనసు ఒప్పడం లేదా? లేక భయపడుతున్నారా అన్న చర్చలు నడుస్తున్నాయి కాంగ్రెస్ వర్గాల్లో.ప్రభుత్వం ఇటీవలే విప్‌లను నియమించడంతో? వేముల వీరేశం వారంలో రెండు రోజులు మీడియా సమావేశాలు పెడుతూ ప్రభుత్వంపై వచ్చే విమర్శలకు కౌంటర్ ఇస్తున్నారు. ఒకరిద్దరు నాయకులైతే? పార్టీ ఆఫీస్‌కు రావడం మానేసి నేరుగా మొబైల్‌లో వీడియోలు తీసి పంపడానికి అలవాటుపడ్డారు. ఇలాంటి వ్యవహారాలన్నిటి మీద సీఎం రేవంత్ రెడ్డి చాలా రోజులుగా నజర్ పెట్టినట్టు తెలిసింది. ఎవరేం చేస్తున్నారు? ఎవరి పని తీరు ఎలా ఉందన్న సంగతిని నిశితంగా పరిశీలిస్తున్నారట. ఈ క్రమంలో ఇటీవల అసెంబ్లీకి సీఎం వచ్చినప్పుడు? ఓ నలుగురు ఎమ్మెల్యేలు ఆయనకు ఎదురుపడ్డారు. వాళ్ళ మీద ఆయన ఒకింత అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఏం చేస్తున్నారు మీరంతా.. మాకెందుకులే అనుకుంటున్నారా..? అంటూ గట్టిగానే అర్సుకున్నట్టు తెలిసింది.ప్రతిపక్షం నుంచి వచ్చే విమర్శలకే కాదు? కనీసం మనం చేసిన పనుల గురించి అయినా మీడియా సమావేశాలు పెట్టడానికి వచ్చిన ఇబ్బంది ఏంటి..? ప్రెస్‌మీట్స్ ఎలా పెట్టాలో కూడా తెలియదా..? ఏదైనా సరే? చెబితేగానీ మాట్లాడరా..? నలుగురైదుగురు ఓఎం లు మాట్లాడితే పోయేదేముంది అంటూ గట్టిగానే క్లాస్ ఇచ్చారట.

ఓఎంల పనితీరు పై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్న సీఎం రేవంత్? ఇక పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టే పనిలో పడ్డట్టు తెలుస్తోంది. మరి ఆ యాక్షన్‌కు ఎమ్మెల్యేల రియాక్షన్ ఎలా ఉంటుంది? వాళ్ళు మారతారా?? లేక ఆ నలుగురైదుగురే మాట్లాడుకుంటారులే అని ఎప్పట్లాగే ఎవరికి వారు కామ్ అయిపోతారా అన్నది చూడాలి.

# రోడ్డు ప్రమాదంలో ఫౌజి మూవీ యూనిట్ సభ్యుడు మృతి

## ఐదుగురికి తీవ్ర గాయాలు



హైదరాబాద్ ప్రభాస్ ఫౌజీ మూవీ యూనిట్ సభ్యులకు ప్రమాదం వాటిల్లింది. ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో ఐదుగురుకి తీవ్ర గాయాలు అయ్యాయి. హైదరాబాద్ - అబ్దుల్లాపూర్ మెట్ పరిధిలో ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# దోపిడీ వెనుక ఆ ముఠా

కరీంనగర్, మే 5 ప్రశాంతతకు మారుపేరైన ఆ నగరం ఉలిక్కిపడింది. నిత్యం రద్దీగా ఉండే ఆ వీధి, పసిడి కాంతుల మధ్య వెలిగిపోయే ఒక వాణిజ్య సముదాయం అల్లకల్లోలంగా మారింది. ఆయుధాలతో వచ్చిన దుండగులు క్షణాల్లో చేసిన అలజడి కేవలం ఆస్తి నష్టాన్ని మాత్రమే కాదు.. పౌరుల భద్రతపై అనేక ప్రశ్నలను లేవనెత్తారు. పట్టపగలే కాల్పుల శబ్దాలతో దద్దరిల్లిన ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొనగా, అప్పటి వరకు సాధారణంగా సాగిపోతున్న జనజీవనం స్తంభించింది. ఇప్పుడు ఆ ముఠా ఎక్కడుంది? ఎటు వెళ్లింది? అన్న ఉత్కంఠ నెలకొన్న తరుణంలో, పోలీసులు ఒక కీలకమైన ప్రకటనతో ముందుకు వచ్చారు మాజీ ఎమ్మెల్యే కుమారుడికి షాకిచ్చిన పోలీసులు కరీంనగర్‌లో కలకలం రేపిన పీఎంజే చోరీ తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ నగరంలోని రద్దీ ప్రాంతంలో పీఎంజే జువెలరీ షాపులో జరిగిన కాల్పులు, చోరీ ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. నిందితులు పక్కా ప్లాన్‌తో వచ్చి, సిబ్బందిని బెదిరించి బంగారం అపహరించడమే కాకుండా కాల్పులకు తెగబడడం పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఈ ఘటనపై స్పందించిన పోలీస్ శాఖ, నిందితుల వేటను ముమ్మరం చేసింది. ఘటనా స్థలంలో సేకరించిన ప్రాథమిక ఆధారాలు, సాక్ష్యాల ప్రకారం.., ఇది ఒక ప్రణాళికాబద్ధమైన నేరమని అధికారులు నిర్ధారించారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఈ కేసు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. బయటపడ్డ ముఖచిత్రాలు నేరం జరిగిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, జువెల్లరీ, పరిసర ప్రాంతాల్లోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. ఐదుగురు నిందితులకు సంబంధించిన స్పష్టమైన చిత్రాలు సేకరించారు. ఈ ఫుటేజీ ఆధారంగా నిందితుల ముఖచిత్రాలను పోలీసులు విడుదల చేశారు. ప్రజలు ఈ ముఖాలను గుర్తించి, పోలీసులకు సహకరించాలని కోరుతున్నారు. ఈ నిందితులు ఎక్కడైనా తలదాచుకొని ఉండవచ్చని, వారిని పట్టుకోవడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. ముఖచిత్రాల విడుదల చేసి వారు తప్పించుకునే మార్గాలను మూసివేయాలని అధికారులు భావిస్తున్నారు దర్యాప్తులో తేలిన మరోగ్భ్రాంతికరమైన విషయం ఏంటంటే, ఈ చోరీకి పాల్పడింది ఒక అంతరాష్ట్ర ముఠా అని గుర్తించారు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చి, రెక్కీ నిర్వహించి నేరానికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ప్రమాదకరమైన ముఠాను పట్టుకోవడానికి 12 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఒక్కో బృందం ఒక్కో కోణంలో గాలింపు చేపడుతోంది. సరిహద్దు ప్రాంతాలతో పాటు, నిందితులు వెళ్లేందుకు అవకాశం ఉన్న అన్ని రహదారులను జల్లెడ పడుతుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారి సెల్ ఫోన్ సిగ్నల్స్, ప్రయాణ మార్గాలను విశ్లేషిస్తున్నారు. ఆచూకీ తెలిపితే లక్ష ఈ కేసులో పురోగతి సాధించేందుకు పోలీసులు ప్రజలకు భారీ

ఆఫర్ ప్రకటించారు. నిందితుల ఆచూకీ తెలిపిన వారికి లేదంటే ఎక్కడ ఉన్నారో సమాచారం అందించిన వారికి రూ. 1,00,000 (లక్ష) నగదు అందజేస్తామని ప్రకటించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. నిందితుల కదలికలపై అనుమానం ఉన్నవారు స్పందించాలని, తద్వారా ఈ అంతరాష్ట్ర నేరగాళ్లను కటకటాల్లోకి నెట్టే అవకాశం ఉంటుందని పోలీసులు పిలుపునిచ్చారు. సంప్రదించాల్సిన నంబర్లు నిందితుల గురించి సమాచారం తెలిసిన వారు నేరుగా పోలీసు అధికారులకు ఫోన్ చేయవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా 8712670762, 8712670711, 8712670713 నంబర్లను కేటాయించారు. ఈ నంబర్లు 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయని, ఏ చిన్న సమాచారం అయినా కేసు దర్యాప్తునకు

సహాయపడుతుందని పోలీసులు తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో పౌర సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పోలీసులకు తోడ్పాటు అందించాలని కోరుతున్నారు. ఈ సాహసోపేత చర్య ద్వారా నేరగాళ్లను పట్టుకొని, నగరంలో మళ్లీ మునుపటి ప్రశాంతతను నెలకొల్పడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తోంది.

# క్లారిటీతో కవిత... మిస్సైన షర్మిళ



హైదరాబాద్, మే 5 తెలంగాణాలో వైఎస్సార్ టీపీని స్టార్ట్ చేసి మూడేళ్ళు నడిపి కాంగ్రెస్ లో విలీనం చేసి ఏపీకి వచ్చి పీసీసీ చీఫ్ గా అయిన షర్మిల తన రాజకీయ పోరాటం వైసీపీ మీదనే అని గట్టిగా చెప్పలేకపోయారు అని గుర్తు చేస్తున్నారు. ఆమె వైసీపీ అధినేత జగన్ ని నేరుగా టార్గెట్ చేయడంతో పాటు వ్యక్తిగత అంశాలు కూడా తెర మీదకు రావడంతో షర్మిల ఇంటి పోరునే రాజకీయ పోరాటంగా మార్చుకున్నారు అన్న భావన అయితే జనంలోకి వెళ్ళింది అని ప్రచారంలో ఉన్న మాట. కట్ చేస్తే తెలంగాణాలో మరో చెల్లెలు కవిత పార్టీ పెట్టారు. ఆ పార్టీ కూడా గులాబీ పార్టీని పోలిన పేరుతోనే టీఆర్ఎస్ గా నామకరణం చేశారు. మరి కవిత రాజకీయ పంథా ఎలా ఉంటుంది అన్నది పెద్ద చర్చగా ఉంది. కవిత ఈ మధ్య కేసీఆర్ మీద విమర్శలు చేశారు. దాని మీద చాలా మంది ప్రతి విమర్శలు కూడా ఆమె మీద చేశారు. తండ్రిని పట్టుకుని కవిత ఇంతింత విమర్శలు చేస్తారా అని కూడా నిలదీశారు. అయితే దానికి కవిత మీట్ ది ప్రెస్ లో క్లారిటీ ఇచ్చారు. తాను విమర్శిస్తున్నది బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ని కానీ తన తండ్రి కేసీఆర్ ని కాదని ఆమె స్పష్టం చేశారు. తనకు తల్లిదండ్రులు ఎంతో చేశారని వారి వల్ల ఏ ఇబ్బంది రాలేదని ఆమె అన్నారు. అయితే రాజకీయ సిద్ధాంత పరంగానే తాను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ని విమర్శిస్తున్నాను అని ఆమె చెప్పుకొచ్చారు కేసీఆర్ లేకపోతే తన జీవితం జన్మ లేవని కూడా ఎమోషనల్ గా కామెంట్స్ చేశారు. తనది సిద్ధాంత బద్ధమైన పోరాటమే తప్ప ఇంటి పోరు కాదని పక్కా క్లారిటీతో కవిత చెప్పిన జవాబు తెలంగాణా సమాజానికి వివరణగానే అనుకోవాల్సి ఉంది. ఈ విధంగా ఆదిలోనే కవిత తన మీద వస్తున్న విమర్శలకు చెక్ పెట్టేశారు. కేసీఆర్ తండ్రి అని ఆయనను ఆయన మీద విమర్శలు ఏంటి అని సామాన్య జనంలో కూడా ఉండే అభిప్రాయాలకు సందేహాలకు ఆమె తెర దించారని అనుకోవాల్సి ఉంది. రక్త సంబంధం ఒక ప్రధాన సెంటిమెంట్. రాజకీయాల్లో చూస్తే అది ఎంతో ప్రభావం చూపిస్తుంది. అందుకే రాజకీయంగానే కాదు అన్ని విధాలుగా పెద్ద అయిన కేసీఆర్ విషయంలో కవిత వ్యూహాత్మకంగానే నమస్కార బాణం వేసారు అని భావించాలి. తాను తండ్రి మీద పోరాడడం లేదని రాజకీయంగానే తన సమరం అని ఆమె చెప్పేశారు. అంటే రామాంజనేయ యుద్ధం లాంటిది అన్న మాట. భక్తి ఉన్నా రాముడి మీద ఆంజనేయుడు యుద్ధం చేసింది సిద్ధాంతపరంగా అని అంటారు. కుటుంబ సభ్యులు రాజకీయాల్లో ఉన్నపుడు ఎక్కువగా వారి మధ్య రక్త బంధాలనే అంతా చర్చిస్తారు. దాని వల్ల కొత్తగా పార్టీ పెట్టిన వారికి కానీ అలాగే రాజకీయంగా స్థిరపడాలని చూసిన వారికి కానీ సమస్యలు వస్తాయి. ప్రజా సమస్యల విషయంలో వారు ఎంతగా పోరాడుతున్నా సరైన వివరణ ఇచ్చే ప్రయత్నం చేయకపోతే బూమరాంగ్ అవుతుంది. ఏపీలో షర్మిల ఇష్యూ అలాగే ఉందని అంటున్నారు. అందుకే కవిత అలెర్ట్ అయి ఈ విధంగా ప్రకటించారా అన్న చర్చ సాగుతోంది. తనకు కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాల వల్లనే పార్టీని పెట్టాను అన్న విమర్శలు జనంలోకి బలంగా వెళ్తే అది పార్టీ ఎదుగుదలకు తీరని అవరోధంగా మారుతుందని కూడా భావించే కవిత ఈ రకమైన క్లారిటీతో ఉన్నారు అని అంటున్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్రాణాలు కోల్పోయిన మరో రైతు

నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం నెల్లిబండ ఐకేపీ కేంద్రం వద్ద నాలుగు రోజుల నుండి ధాన్యం కొనుగోలు కోసం పడిగాపులు కాస్తూ బాబన్ సాహెబ్ గూడ ప్రాంతానికి చెందిన ఎండీ నజీరోద్దీన్(68) అనే రైతు ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. సీపీఆర్ చేసినా స్పందించకపోవడంతో తొటి రైతులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు

## తమిళనాడు గవర్నర్కు టీవీకే అధినేత లేఖ

చెన్నై తమిళనాడు ఎన్నికల్లో విజయడంకా మోగించిన టీవీకే అధినేత విజయ్ రాష్ట్ర గవర్నర్ కు లేఖ రాసారు. తన పార్టీ తరపున ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ను కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండు వారాల్లోగా శాసనసభలో తమ బలాన్ని నిరూపించుకుంటామని విజయ్ హామీ ఇచ్చారు. ఈ లేఖను ఈ-మెయిల్ ద్వారా లోక్భవన్కు పంపినట్లు సమాచారం. ఎన్నికల్లో విజయ్ పార్టీ టీవీకే 108 సీట్లు గెలుచుకున్న విషయం తెలిసిందే.

## దైద గ్రామంలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

పల్నాడు జిల్లా పోలీసులు మంగళవారం ఉదయం గురజాల సబ్ డివిజన్ గురజాల పోలీస్ స్టేషన్ పరిధి లోని సమస్యాత్మక గ్రామం అయిన దైద గ్రామం లో కల్పిస్తూ కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్డెన్ & సెర్చ్ కార్యక్రమం నందు పోలీసు అధికారులను మరియు సిబ్బందిని బృందాలుగా విభజించి రౌడీ షీటర్లు,ట్రబుల్ మాంగర్స్,పాత కేసుల లోని నిందితులపై ప్రత్యేక నిఘా... ఇళ్లు, పరిసర ప్రాంతాలలో విస్తృత తనిఖీలు చేపట్టారు

## మొక్కజొన్న కొనుగోలు కోసం రైతుల ధర్నా

నల్గొండ మొక్కజొన్న కొనుగోలు చేయడం లేదని రైతులు ధర్నాకు దిగారు. కొనుగోలు కేంద్రం తెరిచినా నెల రోజుల నుండి గోస పుచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో మొక్కజొన్న రైతుల ధర్నా తీవ్రమయవడంతో మహబూబాబాద్ - తొర్రూరు ప్రధాన రహదారిపై బైఠాయించారు. దాంతో వాహనాలు . భారీగా నిలిచిపోయాయి. కాంటాలు వేసినా కొనుగులు చేయడంలేదంటూ ఆందోళన కు దిగారు. మళ్లీ వర్షాలు వస్తే తీవ్ర స్థాయిలో నష్టపోతామని రైతులు మండిపడుతున్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు.

# రాఘవ క్రషన్ మిషన్లను కూల్చివేసిన హైడ్రా



రంగారెడ్డి మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ క్రషర్ మిషన్ను హైడ్రా అధికారులు కూల్చివేసారు. రంగారెడ్డి జిల్లా కొత్వాల్ గూడలో మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ క్రషర్స్ అక్రమ మైనింగ్ చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించిన విషయం తెలిసిందే. అసెంబ్లీలో సైతం రాఘవ క్రషర్స్ అక్రమ మైనింగ్పై హరీష్ రావు ప్రశ్నించారు. ప్రజల్లో వ్యతిరేకత రావడంతో చివరకు పొంగులేటిని ఒప్పించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూల్చివేతకు సిద్ధపడిందని సమాచారం.

# పిల్లలకు సమ్మర్ స్పోర్ట్ & గేమ్స్ కోచింగ్ క్యాంప్ ను ప్రారంభించిన ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు,

## సమ్మర్ స్పోర్ట్ & గేమ్స్ క్యాంప్ చిన్నారులకు ఎంతో ఉపయోగకరం: జిల్లా ఎస్పీ

## చిన్నారులు క్రీడాస్ఫూర్తి మరియు ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి: జిల్లా ఎస్పీ

. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ సమ్మర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కోచింగ్ క్యాంప్ -2026 ను మంగళవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఒంగోలులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు ప్రారంభించారు. ఈ క్యాంపులో భాగంగా నిర్వహిస్తున్న పరుగుపందెం, ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్, క్రికెట్ వంటి క్రీడలను జిల్లా ఎస్పీ గారు బెలూన్లు గాలిలోకి ఎగురవేసి ప్రారంభించారు.



అనంతరం, జిల్లా ఎస్పీ గారు స్వయంగా చిన్నారులతో కాసేపు క్రికెట్ ఆడి వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ పిల్లలకు మానసిక ఉల్లాసం, క్రీడల ఆసక్తితో పాటుగా వివిధ క్రీడల పట్ల నైపుణ్యత పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం వేసవి సెలవులలో ఈ క్యాంపును నిర్వహిస్తున్నామని, ఈ క్యాంపు నెల రోజులు పాటు జరుగుతుందని, ఈ సమ్మర్ క్యాంప్ లో పాల్గొనేందుకు పోలీస్ పిల్లలు మరియు ఇతర విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో పిల్లలు వివిధ రకాల ఆటలు మరియు క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాదని, అవి శారీరక మరియు మానసిక అభివృద్ధికి చాలా ముఖ్యమైనవి అని, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, వివిధ పరిస్థితులను ఎదుర్కోవడంలో అవసరమైన మెలకువలు,కొత్త పరిచయాలు మరియు ఓటమిని స్వీకరించే గుణం వంటి ఎన్నో విలువైన విషయాలను క్రీడల ద్వారా నేర్చుకోవచ్చునని మరియు కొత్త స్నేహితులను పొందవచ్చున్నారు. ఒక నెలపాటు జరిగే ఈ క్యాంప్ పిల్లలలో స్ఫూర్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా, వారి జీవితంలో చిరస్మరణీయ అనుభవంగా నిలుస్తుందని అన్నారు. క్రీడల పట్ల ఆసక్తి కలిగిన వారిని ఆ దిశలో ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకుంటారన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పిల్లలకు ఫిజికల్ ఫిట్నెస్ ఎంతో అవసరమని, క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం చేకూరుతుందన్నారు.

# మోండా డివిజన్ వెస్ట్ మారేడ్ పల్లిలో ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ ను ప్రారంభించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మంగళవారం మోండా డివిజన్ వెస్ట్ మారేడ్ పల్లిలో సాయి సాత్విక్ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు మహిళా సంఘాలకు ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.మహిళలు ఆర్థికంగా బలపడాలనే ఉద్దేశంతో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తుందని చెప్పారు. క్యాంటిన్ ఏర్పాటు చేసిన మహిళా సంఘ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట బోయిన్ పల్లి సర్కిల్ డి సి డాకూనాయక్, మెప్మా కో ఆర్డినేటర్ యాదయ్య, అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుధాకర్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్ యాదవ్, బద్రీనాథ్ యాదవ్, వైష్ణవి యాదవ్, ధనలక్ష్మి, శేఖర్ ముదిరాజ్, శ్రీనాథ్, రషీద్ తదితరులు పాల్గొన్నారు

# తహసిల్దార్ కార్యాలయం ఎదుట వృద్ధ దంపతుల నిరసన

ఎన్టీఆర్ జిల్లా జి కొండూరు మండల తహసిల్దార్ కార్యాలయం ఎదుట వృద్ధ దంపతులు నిరసనకు దిగారు. విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఫోటోతో తాసిల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. భూ వివాద విషయంలో కాళ్లు అరిగేదాకా తిరిగినా న్యాయం దక్కటం లేదంటూ ఆవేదన వ్యక్తం చేసారు. బాధితులు జి కొండూరు మండలం కుంటముక్కల గ్రామానికి చెందినవారు. గత ఐదు నెలలుగా ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ఖఱఖీూ )కు వెళ్లిన పరిష్కారం కావడం లేదు అంటూ ఆరోపించారు. ఉన్నతాధికారులు ఆదేశించినా జి కొండూరు రెవిన్యూ ఆఫీసు వారికి సమస్యను పరిష్కరించే సమయం లేదంటూ మండిపడ్డారు. తమకు న్యాయం జరిగేదాకా కదిలేది లేదని జి కొండూరు తహసిల్దార్ కార్యాలయంలో వృద్ధ దంపతులు లోకేష్ ఫోటోతో నిరసనకు దిగారు. ఏ పని చేయలేని స్థితిలో ఉన్న మమ్మల్ని ఆదుకోవాలంటూ నారా లోకేష్ కు వేడుకుంటున్నారు.

# జాతర ఏర్పాట్లు పరిశీలించిన ఇంచార్జి కమిషనర్ శారదా దేవి.



తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర నిర్వహణ ఏర్పాట్లను నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి, ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, అధికారులతో కలసి సోమవారం సాయంత్రం పరిశీలించారు. చేస్తున్న, చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పటికే ఆయా విభాగాల అధికారులు విధులు కేటాయించామని అందరూ వారి వారి విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుని జాతర విజయవంతం చేయాలని తెలిపారు. ఇంచార్జ్ కమిషనర్ వెంట డి.ఎస్.పి భక్తవత్సలం, ఈవో జయకుమార్ , మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ , డి.ఈ లు రాజు, శిల్పా, ఏసిపి పార్వతిప్రియ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

# అక్రమ మైనింగ్‌పై హైడ్రా కఠిన చర్యలు

# ఒకేరోజు 6 ప్రాంతాల్లో హైడ్రా ఆపరేషన్లు

**6 క్రషింగ్ యూనిట్లను తొలగించిన హైడ్రా**

**12 Fzn ప్లాంట్స్ తొలగింపు**

**సంబంధిత శాఖల ఫిర్యాదు మేరకు చర్యలు**

**పీసీబీ, మైనింగ్, రెవెన్యూ డిపార్ట్మెంట్ల ఆధ్వర్యంలో కూల్చివేతలు.**

**హైడ్రా సహకారాన్ని కోరిన పీసీబీ, మైనింగ్, రెవెన్యూ డిపార్టుమెంట్లు**

**రూ. వందల కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ యూనిట్లు.**

**బడాబాబుల అండతో నడుస్తున్న మైనింగ్, క్రషింగ్, ఖీఓఅ ప్లాంట్లు**

**బడాబాబులతో పైరవీలతో నడుస్తున్న యూనిట్లపై ఆయా శాఖల ఫిర్యాదుతో హైడ్రా చర్యలు.**

హైదరాబాద్, మే 05: మంగళవారం హైడ్రా భారీ ఆపరేషన్.× అనుమతులు లేకుండా మైనింగ్, క్రషింగ్, ఖీఓఅ యూనిట్లను నడుపుతున్నవారిపై హైడ్రా చర్యలు.× పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మైనింగ్ శాఖల నుంచి ఫిర్యాదు అందగానే రంగంలోకి దిగిన హైడ్రా.× మంగళవారం ఉదయం ఒకేసారి 6 ప్రాంతాల్లో దాడులు చేసి అక్రమ మైనింగ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టిన హైడ్రా.× 12 ఖీఓఅ ప్లాంట్లను తొలగించిన హైడ్రా. × రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం వట్టినాగులపల్లి, శేరిలింగంపల్లి మండలంలోని గొలిదొడ్డి విలేజ్, శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ విలేజ్‌లో ఈ దాడులు చేసింది.× ఇష్టానుసారం క్వారీలు తవ్వి.. స్టోన్ క్రషింగ్‌తో దుమ్ము రేపి .. పరిసరాలను నాశనం చేసేవారిపై హైడ్రా చర్యలు.× విపరీతమైన దుమ్ముతో వాతావరణాన్ని కాలుష్యం చేయడాన్ని నియంత్రించింది.× బండ రాళ్లను పేల్చి పరిసర ప్రాంతాల్లోని నివాసాలకు ముప్పుగా పరిణమించిన అక్రమ మైనింగ్‌కు హైడ్రా చర్యలు. × 6 చోట్ల స్టోన్ క్రషింగ్ యూనిట్లను నేల కూల్చినా హైడ్రా.× భవిష్యత్తులో అక్కడ స్టోన్ క్రషింగ్ చేయడానికి వీలు లేకుండా.. యంత్ర సామగ్రిని తొలగాంచిన హైడ్రా.× గతంలో మైనింగ్, పీసీబీ శాఖల హెచ్చరికలను పట్టించుకోకుండా యథేచ్ఛగా సాగుతున్న అక్రమ మైనింగ్‌కు హైడ్రా మంగళవారం శాశ్వతంగా చెక్ పెట్టింది.



# కొండపల్లి లో రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై దాడి



ఎన్టీఆర్ కొండపల్లి శాంతినగర్ ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం గోదాంపై అధికారులు దాడి నిర్వహించారు. ఇబ్రహీంపట్నం పోలీసులు మరియు రెవెన్యూ శాఖ సంయుక్తంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భారీగా బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకున్నారు.శాంతినగర్‌లోని అభినందన ఫ్లాట్స్‌లో సుమారు 600 బస్తాల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం పీడీఎస్ ఎస్ డీటీ రామకృష్ణ మాట్లాడుతూ, స్వాధీనం చేసుకున్న బియ్యం నిల్వలపై పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోందని తెలిపారు.ఈ కేసులో అక్రమ రవాణాకు సంబంధించి దేరంగుల గోపిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ వ్యవహారంపై మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని అధికారులు పేర్కొన్నారు.

# భార్యకు విషమిచ్చి చంపిన భర్త



కడప ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్ రెడ్డి నగర్ లో భద్రిపల్లె పద్మ ను ఆమె భర్త బద్రి పల్లి కిరణ్ విషమిచ్చి చంపిన కేసులో భర్తను అరెస్టు చేసినట్లు అడిషనల్ ఎస్పీ విభూ కృష్ణ తెలిపారు. ప్రొద్దుటూరు సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భార్య లావుగా ఉందని , ఎక్కువ తిండి తింటుందని దానివల్ల చంపినట్లు చెప్పారన్నారు... ఎనిమిదేళ్ల క్రితం వివాహమైందని భద్రిపల్లె కిరణ్ ముద్దనూరులోని వారి మామ ఇంటిలోనే ఉంటున్నాడని , ఏడు సంవత్సరాల కుమార్తె కూడా ఉందన్నారు. భార్యని ఎలాగైనా చంపాలని భావించిన భద్రి పల్లి కిరణ్ నెట్లో సెర్చ్ చేసి 80 వేలు విలువచేసే విష పదార్థాన్ని తెప్పించారన్నారు. భార్యను ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్ రెడ్డి నగర్ లోని కిరణ్ తల్లిదండ్రుల ఇంటికి గత నెల 26వ తేదీన తీసుకొచ్చారన్నారు. విషాన్ని 29వ తేదీ రాత్రి భార్యకి విషమిచ్చి , ఆమె పడిపోయాక దిండు అదిమిపట్టి ఊపిరాడకుండా చేశారన్నారు. అతనికేమీ తెలియనట్లు భార్య కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పారని వివరించారు. మృతురాలు తండ్రి ముద్దనూరు పట్టణానికి చెందిన బెంగుళూరు రాజకుల్లాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారని , విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చినట్లు పేర్కొన్నారు..

# తమిళనాడు ఫలితాలే ఏపీలో పునరావృతం అవుతుంది.

**12వ పీఆర్సీ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించాలి.**

**కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్.**

**ఒంగోలు కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ భారీ ధర్నా**

తమిళనాడు ఎన్నికల ఫలితాలే ఏపీలో పునరావృతం అవుతుందని, కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ అన్నారు. మంగళవారం ఒంగోలు కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతామోహన్ మీడియాతో మాట్లాడారు. తమిళనాడు రాష్ట్రంలో రెండు అతి పెద్ద ద్రావిడ పార్టీలను కాదని, ప్రజలు మార్పు కోరుకున్నారని, అలాగే కేరళ, బెంగాల్ బెంగాల్ రాష్ట్రాల్లో కూడా ప్రజలు మార్పుకు ఓటేశారని తెలిపారు. 2029 ఎన్నికల్లో ఏపీలో కూడా వైసిపి, టిడిపి ప్రాంతీయ పార్టీలకు పరాభవం తప్పదన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ఏపీ ప్రజల్లో సానుకూలత మొదలైందన్నారు. 12 పీఆర్సీ వెంటనే ప్రకటించాలని చింతామోహన్ డిమాండ్ చేశారు. గత 8 సంవత్సరాలుగా పీఆర్సీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. 6 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు తమ బిడ్డలను చదివించుకోలేక, ఇంటి అద్దెలు చెల్లించలేక, మూడు రూపాయలకు వడ్డీలకు తెచ్చి కుటుంబాలను నెట్టుకొస్తున్నారని పేర్కొన్నారు. మే నెలాఖరులోపు 30 వేల కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించాలని కోరారు. వైసిపి, టిడిపి పార్టీలు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని విమర్శించారు. అమరావతి చంద్రావతిగా మారిందని ఎద్దేవా చేశారు. అప్పులు తెచ్చి రాజధాని కట్టుకోవలసిన అవసరం ఏమొచ్చింది ప్రశ్నించారు. రాయలసీమ జిల్లాల్లో, ఉత్తరాంధ్ర ప్రజలు అమరావతిని ఇష్టపడటం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రోజుకొక్క జిల్లాలో పర్యటిస్తూ, కొత్త కొత్తగా స్టేట్మెంట్ ఇచ్చి, ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అపద్దాలను అందంగా పెద్ద పెద్ద అక్షరాలతో పత్రికలు రాస్తున్నారని, వాటిని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ లో ఇన్ చార్జీ డిఆర్ఓ గారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఎస్సీ నాయకులు విజయేంద్ర బహుజన్, అశోక్ బాబు, కొండల రావు, కొప్పోలు ఏడుకొండలు, మేడిద శాంతరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్‌కి పదిహేను లక్షలు విరాళం ప్రకటించిన మోహన్ బాబు



దర్శకరత్న దాసరి నారాయణరావు పుట్టిన రోజు (మే 4)ని డైరెక్టర్స్ డేగా తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ (టీఎఫ్‌డీఏ) నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. కలయిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సోమవారం నాడు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భారత చలన చిత్ర పరిశ్రమలకు చెందిన ప్రముఖులెంతో మంది హాజరయ్యారు. ఈ ఈవెంట్‌లో పలు భాషలకు చెందిన ప్రముఖ దర్శకులెందరినో సత్కరించారు. ఈ కార్యక్రమంలో..

×మోహన్ బాబు మాట్లాడుతూ× .. 'తండ్రిలాంటి దాసరి గారు లేరనే లోటు నాకు ఈ జీవితాంతం ఉంటుంది. ఓ సాధారణ వ్యక్తిని తీసుకు వచ్చి మోహన్ బాబుగా మార్చారు. హిందీ చిత్ర దర్శకుడు బాల్కి గారికి ఈ అవార్డుని ఇవ్వడం ఆనందంగా ఉంది. దర్శకుడు అనే పదానికి అర్థం చెప్పిన ఏకైక వ్యక్తి దాసరి గారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమలోని దర్శకులంతా కలిసి ఇలాంటి ఈవెంట్ నిర్వహిస్తుండటం ఆనందంగా ఉంది. ఈ స్టేజ్ మీదున్న వారంతా గొప్ప దర్శకులే. ఇంత ఘనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదిత్య గారి బృందంకు హ్యాట్సాఫ్. ఈ కార్యక్రమాలు అవార్డుల్ని ఎంచుకున్న, ఇచ్చిన తీరు అద్భుతంగా ఉంది. మా యూనివర్సిటీలో అక్కయ్య గారి పేరు మీద గోల్డ్ మెడల్స్ ఇస్తుంటాను. దాసరి గారి పేరు మీద ఆడిటోరియంను కట్టాం. తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ (టీఎఫ్‌డీఏ)కి పదిహేను లక్షలు ఆర్థిక విరాళాన్ని అందిస్తాను. చిత్ర సీమ ఉన్నంత వరకు దాసరి గారి పేరు చిరస్థాయిగా నిలబడుతుంది' అని అన్నారు.

×జయప్రద మాట్లాడుతూ× .. 'గురువు గారు దాసరి గారి పుట్టిన రోజుని ఇలా సెలెబ్రేట్ చేయడం, ఇలాంటి కార్యక్రమానికి మమ్మల్ని పిలవడం ఆనందంగా ఉంది. దాసరి గారు మాకు నటనలో అక్షరాభ్యాసం చేయించారు. ఆయన ఎప్పుడూ మన గుండెల్లోనే ఉంటారు. జయసుధ, నేను దాసరి గారితో ఎన్నో చిత్రాల్ని చేశాం. మేం ఇద్దరం అక్కాచెల్లెళ్లుగా ఎన్నో చిత్రాల్లో నటించాం. ఆర్. నారాయణమూర్తి ఎప్పుడూ ప్రజా సమస్యలపై గొప్ప చిత్రాల్ని రూపొందించారు. నాకు గురువు, తండ్రి లాంటి వారు కె. విశ్వనాథ్ గారు. ఎన్నో గొప్ప పాత్రల్ని ఇచ్చి నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన గురువు దాసరి గారికి ఎప్పుడూ రుణపడి ఉంటాను. ఆయనతో పని చేయడం ఎంతో అదృష్టంగా, గర్వకారణంగా భావిస్తున్నాను' అని అన్నారు.

×జయసుధ మాట్లాడుతూ× .. 'గురువు దాసరి గారి వల్లే నేను ఈ రోజు ఇలా నిలబడగలిగాను. ఆయన లేని లోటు ఇప్పటికీ, ఎప్పటికీ గుర్తుకు వస్తూనే ఉంటుంది. నా సినీ ప్రయాణంలో ఆయనది చెరగని ముద్ర. అన్ని అవార్డులకంటే ఈ అవార్డు చాలా గొప్పది. ఎంతో మంది గొప్ప దర్శకులు చిత్ర సీమలోకి వస్తున్నారు. ముందు ముందు నిర్వహించే ఈ క్రియేటర్స్ ఫీస్ట్‌లో అందరూ పాల్గొనాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. ×బాల్కి మాట్లాడుతూ× .. 'దాసరి గారి పుట్టిన రోజుని ఇలా సెలెబ్రేట్ చేస్తుండటం ఆనందంగా ఉంది. ఆదిత్య గారు పిలిచిన వెంటనే ఈ కార్యక్రమానికి రావాలని అనుకున్నాను. ఇప్పుడు ఇండియాకి సెంటర్‌గా టాలీవుడ్ ఉంది. ఇక్కడి ఆడియెన్స్ సినిమాల మీద చూపించే ప్రేమ మరెక్కడా కనిపించదు. ఇక్కడ నాకెంతో మంది ఇష్టమైన దర్శకులున్నారు. మరీ ముఖ్యంగా సింగీతం గారంటే చాలా అభిమానం. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతో మందికి ఆదర్శనంగా నిలుస్తున్న తెలుగు చిత్ర పరిశ్రమకు హ్యాట్సాఫ్' అని అన్నారు.

×ఎస్వీ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ× .. 'ఇక్కడ ఈ స్టేజ్ మీదున్న గొప్ప దర్శకుల్ని చూసి నేను ఎంతో మురిసిపోతోన్నాను. ఎంతో మంది మహానుభావుల మధ్య ఈ ఈవెంట్‌ను నిర్వహిస్తుండటం సంతోషంగా ఉంది' అని అన్నారు.

×వల్లభనేని అనిల్ మాట్లాడుతూ× .. 'దాసరి గారి పుట్టిన రోజున ఈ డైరెక్టర్స్ డే నిర్వహిస్తుండటం ఆనందంగా ఉంది. ఎన్ శంకర్ గారు, వీర శంకర్ గారు, ఆదిత్య గారు ఇలా అందరూ ఈ ఈవెంట్‌ను అద్భుతంగా నిర్వహిస్తున్నారు. దాసరి గారి ఆశయాల్ని మనం ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

×వీర శంకర్ మాట్లాడుతూ× .. 'ప్రపంచంలో ఏ చిత్ర పరిశ్రమ కూడా ఇలాంటి ఓ రోజుని నిర్వహించుకోదు. దాసరి గారి పుట్టిన రోజున డైరెక్టర్స్ డే చేయాలని ప్రపోజల్ ఇచ్చిన మహనీయులు కళాతపస్వీ కె. విశ్వనాథ్ గారు. ఎన్. శంకర్ గారు ఎన్నికైన వెంటనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంత గొప్పగా ఈ ఈవెంట్‌ను నిర్వహిస్తున్న టీంకు ప్రత్యేక అభినందనలు' అని అన్నారు.

×ఎన్ శంకర్ మాట్లాడుతూ× .. 'సినీ ప్రపంచంలో దాసరి గారి లాంటి వారు మళ్లీ పుట్టరు. ఆయన పుట్టిన రోజుని ఇలా సెలెబ్రేట్ చేసుకోవడం మా అందరికీ గర్వకారణంగా ఉంది. ఈ కార్యక్రమం ఎప్పటికీ ఇలానే కొనసాగాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

×చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ× .. "దర్శకులు సమాజాన్ని ఉత్తేజపరుస్తారు. ఓ ఆర్టిస్టుని దేవుడిగా తయారు చేస్తారు. అలాంటి శక్తి ఉన్న వారే దర్శకులు. మన తెలుగు దర్శకులు ఇంకా ఎంతో ఎత్తుకు ఎదగాలని ఆశిస్తున్నాను. ప్రపంచ స్థాయిలో అవార్డులన్నీ తెలుగు వాళ్లు సంపాదించే రోజు ముందుంది' అని అన్నారు.

×పీజీ విందా మాట్లాడుతూ× .. 'ఓ దర్శకుడు రాత్రీపగలూ అన్న తేడా లేకుండా సినిమా కోసం పని చేస్తుంటారు. అలాంటి దర్శకులకు మే 4న డైరెక్టర్స్ డే అని పెట్టి గౌరవించుకోవడం ఆనందంగా ఉంది. ఇది ఇండియాలో నెంబర్ వన్ ఈవెంట్‌గా మారాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

×కార్తిక్ రాజా మాట్లాడుతూ× .. 'డైరెక్టర్స్ డే సెలెబ్రేషన్స్‌కి మమ్మల్ని ఆహ్వానించిన వివిన్ ఆదిత్య గారికి థాంక్స్' అని అన్నారు.

×ఉదయ్ కుమార్ మాట్లాడుతూ× .. 'తెలుగులో నేను రెండు సినిమాలకు దర్శకత్వం వహించాను. నేను ఈ రోజు ఇలా ఈ స్టేజ్ మీద నిల్చుండటం గర్వంగా ఉంది. భారత సినీ పరిశ్రమలోని దర్శకుల్ని ఇలా గౌరవిస్తుండటం ఆనందంగా ఉంది. దక్షిణ భారత సినీ దర్శకుల సంఘంకి దాసరి గారు అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన ఎంతో మందికి అవకాశాల్ని ఇచ్చారు.' అని అన్నారు. దర్శకులు ఎంతో మంది హీరోల్ని, సీఎంల్ని కూడా తయారు చేస్తారు' అని అన్నారు.

×రామ్ జగదీష్ మాట్లాడుతూ× .. 'ఎంతో మంది గొప్ప దర్శకులు ఈ స్టేజ్ మీదున్నారు. మాట్లాడేందుకు నా అర్హత కూడా సరిపోదు. ఇలాంటి గొప్ప కార్యక్రమం చేస్తున్న టీఎఫ్‌డీఏ గురించి ఎంత చెప్పినా తక్కువే. తెలుగు చిత్ర సీమ నుంచి నేను కూడా ఓ దర్శకుడిగా రావడం అదృష్టంగా భావిస్తున్నాను' అని అన్నారు.

×మైత్రి రవి మాట్లాడుతూ× .. 'డైరెక్టర్స్ డే సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఇంత గొప్పగా నిర్వహిస్తున్న ప్రతీ ఒక్కరికీ థాంక్స్. బేబీ తరువాత సాయి రాజేష్ గారు ఇలాంటి సంస్థ కోసం ఎక్కువ టైం కేటాయిస్తుండటం సంతోషంగా ఉంది. ఆదిత్య గారు అందరినీ కో ఆర్డినేట్ చేస్తూ ఈవెంట్‌ను గొప్పగా నిర్వహిస్తున్నారు. మీ ఈ అసోసియేషన్ ఎప్పుడూ ఇలానే ముందుకు వెళ్తూ ఉండాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

×బాబు మోహన్ మాట్లాడుతూ× .. 'ఎంతో మంది మహామహులైన దర్శకులతో పని చేశాను. కానీ అందరిలోనూ దాసరి గారు ఎంతో గొప్ప వ్యక్తి. దాసరి గారు నన్నెంతో ప్రేమించేవారు. నన్ను బిడ్డలా చూసుకునేవారు. ఆయన పరమపదించడం దురదృష్టకరం. దాసరి గారి పుట్టిన రోజుని ఇలా డైరెక్టర్స్ డే అని నిర్వహిస్తున్న ప్రతీ ఒక్కరికీ నా అభినందనలు' అని అన్నారు.

×ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ× .. 'సర్వేపల్లి గారి పుట్టిన రోజుని ఉపాధ్యాయ దినోత్సవంగా చేసుకుంటున్నాం. అలానే దాసరి గారి పుట్టిన రోజుని డైరెక్టర్స్ డేని సెలెబ్రేట్ చేసుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. ఈ కార్యక్రమాన్ని ఇంత గొప్పగా నిర్వహిస్తున్న ప్రతీ ఒక్కరికీ నా నమస్కారాలు. మా గురువు దాసరి గారు నాకు అన్నం పెట్టి హీరోని చేశారు. ఇప్పుడు హీరోలు, దర్శకులు ఎక్కువ సినిమాలు చేస్తూ ఉంటేనే ఇండస్ట్రీ పచ్చగా ఉంటుంది' అని అన్నారు.

×తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ× .. 'దాసరి గారు మన అందరినీ అనాథల్ని చేసి వెళ్లిపోయారు. కె. విశ్వనాథ్ గారి సలహాతో మే 4న దాసరి గారి పుట్టిన రోజుని డైరెక్టర్స్ డే గా నిర్వహిస్తున్నాం. ఓ డైరెక్టర్ 150కి పైగా చిత్రాలకు దర్శకత్వం, 250కి పైగా చిత్రాలకు మాటలు రాయడం, ఐదారు వందల పాటలు రాయడం మామూలు విషయం కాదు. 50 చిత్రాలపైకు పైగా నిర్మించారు, ఎన్నో గొప్ప పాత్రల్ని పోషించారు, 'ఉదయం' పేపర్‌ను కూడా ప్రారంభించారు. ఆయన మేధస్సు చాలా గొప్పది. ఇన్ని పనుల మధ్య సేవా కార్యక్రమాలు, కార్మికుల సమస్యల్ని తీర్చేవారు. ఆయన అంతటి గొప్పవారు కాబట్టే ఆయన బర్త్ డేకి ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ ఈవెంట్‌ని ఘనంగా నిర్వహించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు' అని అన్నారు.

## జిల్లాలో ఘనంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం

### ఆదిలాబాద్ హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో 'రైతు వారోత్సవాలు'



ఆదిలాబాద్, మే : 05 జిల్లాలో వ్యవసాయ రంగ ముఖచిత్రాన్ని మార్చేందుకు ఉద్యాన పంటలే సరైన మార్గమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా స్థానిక హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రైతు వారోత్సవాల'ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వ్యవసాయ రంగ ముఖచిత్రాన్ని మార్చేందుకు ఉద్యాన పంటలే సరైన మార్గమని, రైతులు కేవలం పత్తి, సోయా చిక్కుడు వంటి సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, మార్కెట్లో అధిక డిమాండ్ ఉన్న ఉద్యాన పంటల వైపు దృష్టి సారించాలి. ఆదిలాబాద్ జిల్లా వాతావరణం ఆయిల్ పామ్ సాగుకు ఎంతో అనుకూలం అని, దీని ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన అధిక ఆదాయం లభిస్తుందన్నారు. ప్రభుత్వం అందించే భారీ సబ్సిడీలను, డ్రిప్ ఇరిగేషన్ సదుపాయాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని, అధునిక సాగు పద్ధతులు, యాంత్రీకరణను జోడించడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పాదకత సాధించవచ్చున్నారు. హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్తల సలహాలను రైతులు ఎప్పటికప్పుడు పాటించాలని, ఆయిల్ పామ్ లేదా ఇతర పండ్ల తోటలలో అంతర పంటలుగా కూరగాయలు, అల్లం, పసుపు వంటివి సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. దీనివల్ల రైతుకు ఆర్థిక భరోసా పెరుగుతుందని, ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హత కలిగిన రైతుకు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. విత్తనాలు, ఎరువుల సరఫరాలో ఎలాంటి జాప్యం జరగకూడదని, రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం నిరంతరం అందుబాటులో ఉంచాలని అని అన్నారు. ఈ సందర్భంగా రైతులకు కూరగాయల విత్తనాల కిట్స్, ఆయిల్ ఫామ్ అగ్రిమెంట్ పత్రాలను కలెక్టర్ అందజేసి, సుగంధ ద్రవ్యాల స్టాల్ ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి , జిల్లా ఉద్యాన శాఖ అధికారి నర్సయ్య, వివిధ మండలాల రైతులు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పై రసమయి బాలకిషన్ తిరుగుబాటు?

### ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు



కేసీఆర్ వల్లే బీఆర్ఎస్ ఓడిపోయిందని బీఆర్ఎస్ నేత రసమయి బాలకిషన్ సంచలన వ్యాఖలు చేసారు. ఉద్యమ ద్రోహులను దగ్గరికి తీసుకున్నడు. నాలాంటి వాళ్లను పక్కనబెట్టి, తెలంగాణ ఉద్యమంపై రాళ్లేసినవారికే పదవులిచ్చిండు. నేను ఎమ్మెల్యేగా ఉంటే తలసానిని మంత్రిని చేసిండు. ప్రజలు అది జీర్ణించుకోలేదు. కేసీఆర్ పతనం అక్కడే మొదలైందని అయన అన్నారు.

## ధాన్యం కొనుగోలు సమర్థవంతంగా చేయండి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి. జిల్లాలో ధాన్యం కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయని, ప్రస్తుతం పీక్ దశలో కొనసాగుతున్నందున ఎటువంటి అంతరాయాలు లేకుండా సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోమంగళవారం పౌర సరఫరాలు శాఖ, సంస్థ, వ్యవసాయ, సహకార, డిఆర్డీఓ, పంచాయతీ రాజ్, వైద్య శాఖల అధికారులు, మిల్లర్లు, ట్రాన్స్ పోర్టర్లుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు, సౌకర్యాలు పట్ల థర్డ్ పార్టీ పరిశీలనకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయొద్దని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాలో 185 కేంద్రాలు ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటివరకు 130 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయ్యాని, మిగిలినవి సత్వరం ప్రారంభించాలని తెలిపారు. అవసరాన్ని బట్టి మరిన్ని కేంద్రాలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఐదు పారా బాయిల్డ్ రైస్ మిల్లులకు 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 108 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగినట్లు తెలిపారు. ఈ సీజన్‌లో మొత్తం 1 లక్షా 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత సంవత్సరం లక్షా 7 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని, ఈ సంవత్సరం వరి పంట అధికంగా పండినందున మరింత ఎక్కువ ధాన్యం కొనుగోలు అయ్యే అవకాశముందని తెలిపారు. హీట్ వేవ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, తాగునీటి, నీడ సౌకర్యం కల్పించాలని సూచించారు. అస్వస్థతకు గురైతే తక్షణమే వైద్యులను సంప్రదించి వైద్య సేవలు పొందాలని తెలిపారు. వాతావరణ శాఖ సూచన మేరకు రానున్న 4 రోజులు జిల్లాకు వర్ష సూచన ఉన్నందున ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, గన్ని సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని తెలిపారు. కోతలు ప్రారంభమైన నేపథ్యంలో పెద్ద మొత్తంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కొనుగోలు పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల వారీగా పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించామని అన్నారు. వ్యవసాయ శాఖ ఏఈఓలు రైతు వేదికల వద్ద రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సరైన విధానంలో ధాన్యం విక్రయానికి మార్గదర్శకాలు అందించాలని సూచించారు. ప్రస్తుతం పీక్ మూవ్‌మెంట్ కొనసాగుతున్నందున ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. రైతులకు టోకెన్లు జారీ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లర్లు తప్పనిసరిగా అంగీకార పత్రాలు సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, వ్యవసాయ అధికారి బాబూరావు, సహకార అధికారి వాలియా నాయక్, డిఆర్డీఓ బాలకృష్ణ, డిపిఓ శ్రీలత, వైద్య శాఖ అధికారి డా మధుసూదన్, రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

బేతంచర్ల, ఏప్రిల్ 25 వ తేదీ నిర్వహించిన పాలిటెక్నిక్ 2026 ప్రవేశ పరీక్షలో బేతంచర్ల మండల పరిధిలోని అర్.యస్ రంగాపురం గ్రామం లోని ప్రకృతి వి ద్యానికేతన్ కు చెందిన పూర్వ విద్యార్థులు ప్రతిభ చాటారని కరెస్పాండెంట్ నర్ల రవి కుమార్ రెడ్డి తెలియజేసారు. రంగాపురం గ్రామానికి చెందిన నర్ల గీతిక ప్రవేశ పరీక్షలో 120 మార్కులకు 112 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 617 వ ర్యాంకును, అలాగే కొత్తపల్లి గ్రామానికి చెందిన గుర్కా దీక్షిత 120 మార్కులకు 111మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 808 వ ర్యాంకును సాధించారాని తెలియజేసారు. విద్యార్థులను, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు అభినందించారు.

## రైతులారా! ప్రైవేట్ మిల్లర్ల దగ్గరకు వెళ్లి మోసపోకండి

## రైతులకు టీ జి ఐ ఐ సి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి సూచన

### సదాశివపేట, కొండాపూర్ మండలాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన నిర్మలా జగ్గారెడ్డి

సదాశివపేట మే 5:సదాశివపేట, కొండాపూర్ మండలాల్లో మంగళవారం టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పర్యటించారు. సదాశివపేట పట్టణం లోని మార్కెట్ కమిటీ లో , సదాశివపేట మండలం లో నందికంది, కొండాపూర్ మండలం లోని మారేపల్లి, కొండాపూర్, తేర్పోల్, గొల్లపల్లి, మాల్కాపూర్ లలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు.



ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రైవేట్ మిల్లర్ల దగ్గరకు వెళ్ళి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్మాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. పిఎసిఎస్ ఆధ్వర్యం లో ఏర్పాటైన కొనుగోలు కేంద్రాల్లో సన్న బియ్యం అమ్మితే క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ వస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిడిసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అలివేని నర్సింహ రెడ్డి, వైస్ చైర్మన్ కంది కృష్ణ, సదాశివపేట మున్సిపల్ చైర్మన్ అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ చిరు, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సిద్దన్న , వ్యవసాయ శాఖ అధికారులు, ఆయా మండలాల తహశీల్దార్ లు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే ప్రసక్తేలేదు:మమత



బెంగాల్ మే 5 ;బంగాల్ ఎన్నికల నిర్వహణపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఘాటు విమర్శలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాము ప్రజా తీర్పు వల్ల ఓడిపోలేదని, కుట్రతో పరాజయం పాలైనట్లు పేర్కొన్నారు. అందుకే తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే ప్రసక్తేలేదని ఆమె తేల్చి చెప్పారు. బంగాల్ ఎన్నికల ఫలితాల తర్వాత తనకు సంఘీభావం తెలిపేందుకు కాంగ్రెస్? అధినేత్రి సోనియా, అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేశారని చెప్పారు. ఇకపై తాను ఇండియా కూటమిని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని వ్యాఖ్యానించారు.

“బంగాల్ సీఎం పదవికి రాజీనామా చేయను. లోక్‌భవన్‌కు వెళ్లను. గవర్నర్‌కు రాజీనామా ఇవ్వను. ఎందుకంటే, లెక్కింపు ప్రక్రియలో భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయి. దాదాపు 100 స్థానాల్లో ప్రజా తీర్పును దోచుకున్నారు. పార్టీ మనోధైర్యాన్ని దెబ్బతీయడానికి ఉద్దేశపూర్వకంగా కౌంటింగ్?ను నెమ్మదింపజేశారు. ఇకపై అధికారం లేకపోయినా పోరాటం చేస్తాం. ఇంత దారుణంగా నిర్వహించిన ఎన్నికలను ఎప్పుడూ చూడలేదు. ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరించింది. కేంద్రం నియంత్రణలో ఈసీ పనిచేసిందని ఆరోపించారు.

# యూజీసీ - నెట్ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల




న్యూ ఢిల్లీ మే 5:జూన్ 22 నుంచి 30వ తేదీ వరకు ఈ ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆన్?లైన్ దరఖాస్తు ప్రక్రియ స్టార్ట్ అయ్యింది. మరి, నెట్ ఎగ్జామ్?కు ఉండాల్సిన విద్యార్హతలు, వయోపరిమితి, దరఖాస్తుకు చివరి తేదీ ఎప్పుడు? వంటి పూర్తి వివరాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం.

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఏటా నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) ఎగ్జామ్?ను రెండు సార్లు నిర్వహిస్తోంది. ఇటీవల జూన్-2026కు సంబంధించిన పరీక్ష షెడ్యూల్ రిలీజ్ అయ్యింది. జూనియర్ రిసెర్చి ఫెలోషిప్, విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు, పీహెచ్‌డీ ప్రవేశాలకు ఉపయోగపడే ఈ ఎగ్జామ్?ను మొత్తం 87 సబ్జెక్టులకు సీబీటీ పరీక్ష ఆధారంగా నిర్వహిస్తారు. ఈసారి కొత్తగా స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్ చేర్చారు. భాషలు కాకుండా, మిగిలిన సబ్జెక్టుల ప్రశ్నాపత్రాలు ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటాయి. నెట్ ఎగ్జామ్?లో అర్హత సాధించడానికి 3 కేటగిరీలు ఉన్నాయి. వాటిల్లో మీ అవసరాన్ని బట్టి ఏదైనా సెలెక్ట్ చేసుకోవచ్చు.

కేటగిరీ-1 : ఈ కేటగిరీలో అర్హత సాధించినవారు ప్రతి నెలా యూజీసీ నిర్దేశిత స్టైపెండ్ (జేఆర్ఎఫ్) పొందుతూ పరిశోధన(పీహెచ్‌డీ) కంటిన్యూ చేయవచ్చు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు, జేఆర్ఎఫ్ లేకుండా జరిపే పీహెచ్‌డీ ప్రవేశాలకూ వీరు అర్హులే.

కేటగిరీ-2 : ఇందులో ఎంపికైతే జేఆర్ఎఫ్ దక్కదు. కానీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, పీహెచ్‌డీ ప్రవేశాలకు అర్హులు అవుతారు.

కేటగిరీ-3 : ఈ కేటగిరీలో సెలెక్ట్ అయ్యినవారు పీహెచ్‌డీలో ప్రవేశానికే మాత్రమే అర్హత సాధిస్తారు. జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కోసం ఎలిజిబిలిటీ పొందరు.

విద్యార్హతలు :

అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించి ఉండాలి. అదే, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ నాన్ క్రీమీ లేయర్, దివ్యాంగులు, థర్డ్ జెండర్లకు 50 శాతం మార్కులు ఉన్నా సరిపోతుంది.

ప్రస్తుతం పీజీ కోర్సులు చదువుతున్నవారు కూడా నెట్ ఎగ్జామ్ రాయడానికి అర్హులే.

నాలుగేళ్ల బ్యాచిలర్ కోర్సులు కంప్లీట్ చేసినవారూ ఈ ఎగ్జామ్?కు అప్లై చేసుకోవచ్చు. వీరికి డిగ్రీలో 75 శాతం మార్కులు అవసరం. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు 70 శాతం మార్కులు ఉంటే చాలు.

యూజీతో జేఆర్ఎఫ్, పీహెచ్‌డీల్లో ప్రవేశానికే అర్హులు. పీజీ చదవనివారు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడలేరు. నాలుగేళ్ల యూజీ లాస్ట్ ఇయర్ కోర్సుల్లో ఉన్నవారూ అప్లై చేసుకోవచ్చు.

వయోపరిమితి :

జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్? (జేఆర్?ఎఫ్?) పొందాలంటే, అభ్యర్థుల వయస్సు 2026 జూన్? 1 నాటికి 30 ఏళ్ల లోపు ఉండాలి.

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ నాన్ క్రీమీ లేయర్, దివ్యాంగులు, థర్డ్ జెండర్లు, మహిళలకు గరిష్ఠ వయసులో ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎలిజిబిలిటీకి, పీహెచ్‌డీ ప్రవేశానికీ ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి లేదు.

డిగ్రీతో యూనియన్ బ్యాంక్?లో అప్రెంటిస్ కొలువు - తెలుగు రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో ఖాళీలు!

## దుప్పిని వేటాడి చంపిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించిన ఫారెస్ట్ అధికారులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 05 ఏటూరు నాగారం** ఏటూరునాగారం దక్షిణ అటవీ క్షేత్ర పరిధిలో గల చిన్నబోయినపల్లి సెక్షన్, చిన్నబోయినపల్లి బీట్ నందు చుక్కల దుప్పిని వేటాడిన ముగ్గురు నిందితులను ములుగు జిల్లా కోర్టుకు రిమాండ్ నిమిత్తం పంపించనైనది,ఉన్నిని లచ్చిమ్ S/ O కిష్టయ్య, R/ O శాపల్లి, యాలశీ చందు S/ O సాంబయ్య R/ O శాపల్లి, కుడుదుల నర్సింఘురావు ా/ ా మల్లయ్య =ా ఆకులవారి ఘనపురం వారిపై వన్య ప్రాణి సంరక్షణ చట్టం, 1972,ప్రకారం కేసు నమోదు, చేయడం జరిగింది. అబ్దుల్ రెహ్మాన్,అటవీ క్షేత్రాధికారి, ఏటూరునాగారం దక్షిణ అటవీ క్షేత్రం, డిప్యూటీ రేంజర్, సి హేచ్ నారాయణ, ఎఫ్ బి ఓ చిస్టీ, , దయానంద్, బేసకాంప్ సిబ్బంది, సాంబ, ప్రశాంత్, మహేష్, డ్రైవర్ ,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వరి ధాన్యం సేకరణపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు

హైదరాబాద్ తెలంగాణలోని పలు జిల్లాల్లో కురుస్తున్న అకాల వర్షాలు మరియు భారీ వేసవి జల్లుల నేపథ్యంలో, రైతులు నష్టపోకుండా ఉండేందుకు రాష్ట్ర నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. అత్యవసర సమీక్షా సమావేశంలో, ధాన్యం సేకరణ ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఒకవైపు ధాన్యం రాక పెరగడం, మరోవైపు ఈ వారం అంతా వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం హై అలర్ట్‌లో ఉంది.ప్రస్తుత రబీ మార్కెటింగ్ సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 14.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని మొత్తం 8,575 కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, ఇప్పటివరకు 1.84 లక్షల మంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. రైతులకు చెల్లింపుల విషయంలో కూడా ప్రభుత్వం వేగంగా వ్యవహరిస్తోంది, ఇప్పటికే రూ. 2,001.96 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది.గత రాత్రి కురిసిన భారీ వర్షాలకు నల్గొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం వంటి జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ముఖ్యంగా నల్గొండలో సుమారు 300 మెట్రిక్ టన్నుల ధాన్యం నీటిపాలైంది. ఈ నష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వం కొన్ని కీలక వ్యూహాలను అమలు చేస్తోంది. తడిసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన పారాబాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని, వాతావరణ హెచ్చరికల ప్రకారం ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద తగినన్ని తార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. అదనంగా, జిల్లాల్లో 16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంచేలా బఫర్ స్టోరేజ్ సామర్థ్యాన్ని కూడా సిద్ధం చేశారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, ధాన్యం సేకరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రులు తమకు కేటాయించిన జిల్లాల్లో స్వయంగా కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని కోరారు.

# రాజకీయ అధికారమే లక్ష్యంగా బీసీల రాజకీయ పోరాటం

**తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీసీనే సీఎం చేసుకుందాం**
**ఇప్పుడున్న పార్టీలన్నీ అగ్రకులాలకు కొమ్ముగాసేవే**
**జూన్ రెండో వారంలో లక్షలాది మందితో బీసీ విద్యార్థి యుద్ధభేరి సభ**
**జులై 12న హైదరాబాదులో బీసీల రాజకీయ ప్లీనరీ**
**ఆగస్టు 7న బెంగళూరులో ఓబీసీ జాతీయ మహాసభ**
**సెప్టెంబర్ నుండ నవంబర్ వరకు మూడు నెలలు రాష్ట్రవ్యాప్తంగా బీసీల రథయాత్ర**
**డిసెంబర్ లో లక్షలాది మందితో పెరేడ్ గ్రౌండ్ లో బీసీల రాజకీయ శంఖారావశీ బహిరంగ సభ**
**బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్**
**కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీలు బీసీ వ్యతిరేక పార్టీలే**
**ఏ పార్టీ బీసీని సీఎం చేస్తామని, జనాభా దామాషా ప్రకారం వాటా ఇస్తామని అనడం లేదు**
**మేక తోలు కప్పుకున్న తోడేళ్లు కొత్త నినాదంతో కొత్త పార్టీతో వస్తున్నరు**
**బీసీలు వారినీ నమ్మి మోసపోవద్దు,**
**అగ్రకులాలు పెట్టే పార్టీలలో బీసీలకు న్యాయం జరుగదు**
**బిసి కులసంఘాల జేఏసీ చెర్మెన్ కుండారపు గణేశా చారి**

హైద్రాబాద్ మే 5:దేశవ్యాప్తంగా శరవేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలు బీసీలకు అనుకూలంగా ఉన్నాయని, నేపాల్ లో జెన్ జీ ఉద్యమం, తమిళనాడులో టీవీకే పార్టీలు అధికారంలోకి దూసుకొచ్చాయని ఇలాంటి తరహాలోనే తెలంగాణ రాష్ట్రంలో కూడా మెజార్టీ ప్రజలైన బీసీ లు రాజ్యాధికారం కైవస్ చేసుకోవడం ఇదే తరహాలో పోరాడితే 2029 లో రాజకీయ అధికారం దక్కడం ఖాయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు హైదరాబాదులోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్ లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు, అన్ని జిల్లాల నుండి బిసి సంక్షేమ సంఘం నేతలు, విద్యార్థి, యువజన, మహిళా, ఉద్యోగ,ఉపాధ్యాయ, ఆర్టీసి ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.అనంతరం గణేశా చారి మాస్లడుతూ

ప్రస్తుతం తెలంగాణలోని ప్రధాన రాజకీయ పార్టీలు అయినా కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు మూడు కూడా సామాజిక న్యాయం పాటించడం లేదని, మెజార్టీ ప్రజలైన బీసీలకు ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించడం లేదు, జనాభా దామాషా ప్రకారం వాటా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు, ఈ పార్టీలు ఒకవైపు అన్యాయం చేస్తుంటే ఇంకొక వైపు మేక తోలు కప్పుకున్న తోడేళ్ల మందలు కొత్త పార్టీతో బయలుదేరి బీసీలను మోసం చేయాలని చూస్తున్నారని, అగ్రకుల రాజకీయ పార్టీలు చేరి బీసీలు మోసపోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు అగ్రకులాల పార్టీలో ఎన్నటికీ బీసీలకు న్యాయం జరగదని, అగ్రకుల రాజకీయ పార్టీలు సామాజిక న్యాయాన్ని సమాధి చేశాయని ఆయన మండిపడ్డారు




బీసీ ఉద్యమాన్ని రాజకీయ ఉద్యమంగా ముందుకు తీసుకు వెళ్తామని, అందుకు బూత్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు రాజకీయ నిర్మాణం చేపడతామని గణేష్ చారి తెలిపారు అందులో భాగంగానే జూన్ రెండో వారంలో లక్షలాదిమందితో బీసీ విద్యార్థి రాజకీయ యుద్ధభేరి సభ నిర్వహిస్తామని, జులై 12 న బీసీల రాజకీయ ప్లీనరని నిర్వహిస్తామని, ఆగస్టు 7న బెంగళూరులో జాతీయ ఓబీసీ మహాసభ

సెప్టెంబర్ మొదటి వారం నుండి నవంబర్ చివరి వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీల రథయాత్ర నిర్వహిస్తామని డిసెంబర్ నెలలో లక్షలాది మందితో హైదరాబాదులోని పెరేడ్ గ్రౌండ్ లో బీసీల రాజకీయ శంఖారావం బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు

ఈ సమావేశం లోబ్బూడూరు భాస్కర్, కొన్నే శంకర్ గౌడ్, ఇంద్రం రజక, నాగరాజ్, మధు యాదవ్,అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మర్పల్లి రాంజీ గోషాలను సందర్శించిన డి.ఎస్.పి సి అంజయ్య




వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి మే 5 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం లోని రాంజీ గోశాలను సందర్శించిన వికారాబాద్ డిఎస్పి సి అంజయ్య, మోమిన్ పెట్ సిఐ, వెంకట్,మర్పల్లి సబ్ ఇన్స్పెక్టర్ రవు ఫ్ రాంజీ గోశాలను సందర్శించడం జరిగిందని తెలిపారు

# కోహీర్ మనీషా గ్యాస్ గోదాంలో చోరీ

## 82 గ్యాస్ సిలిండర్లు ఎత్తుకెళ్లిన దొంగలు



**జహీరాబాద్, మే 5 ప్రజాబలం ప్రతినిధి:** కోహీర్ మండల కేంద్రంలోని మనీషా ఇండియన్ గ్యాస్ గోదాంలో సిలిండర్ల చోరీ జరిగింది. సోమవారం రాత్రి గ్యాస్ గోదాం తాళాలు పగలగొట్టిన దొంగలు 82 గ్యాస్ సిలిండర్లను ఎత్తుకెళ్లినట్లు యజమాని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటన విషయం తెలుసుకున్న పోలీసులు గోదాం వద్దకు చేరుకుని చోరీపై వివరాలను సేకరించారు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే గ్యాస్ కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న వినియోగదారులు గోదాంలో సిలిండర్ల చోరీపై ఆందోళనకు గురవుతున్నారు.



# భూభారతి సమస్యలపై తక్షణ చర్యలు



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం మే 5:**సాదా బైనామా, భూ భారతి పెండింగ్ అప్లికేషన్లను పరిశీలించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి. మంగళవారం ఘట్‌కేసర్ మండల తహసీల్దార్ ఆఫీస్‌ను కీసర ఆర్డిఓ రాజేష్ కుమార్ తో కలిసి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి.ఆకస్మికంగా తనిఖీ చేసినారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సాదా బైనామా, భూ భారతి పెండింగ్ అప్లికేషన్లను పరిశీలించి పెండెన్సి త్వరితగతిన పూర్తి చేయాలని తహాసీల్దారును ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూమి రికార్డుల సమగ్ర పోర్టల్ భూభారతి లో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సూచనలు జారీ చేసారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పెండెన్సికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సాదా బైనామా, భూభారతిరికార్డులను అదనపు కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ తహసీల్దారు చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# ఫిషర్ మెన్ మార్కెటింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ

## అధ్యక్షులుగా సత్యం ముదిరాజ్



**జహీరాబాద్, మే 5 ప్రజా బలం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ జహీరాబాద్ మార్కెటింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులుగా రంజోల్ గ్రామానికి చెందిన సత్యం ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం రంజోల్ గ్రామంలో జిల్లా మత్స శాఖ అధికారి శివలింగ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షులుగా సత్యం ముదిరాజ్ ఉపాధ్యక్షులుగా అంజయ్య, సెక్రటరీగా పరమేశ్వర్, డైరెక్టర్లుగా జగన్ ప్రశాంత్ రాజు వెంకటేశం టి రాజు చంద్రశేఖర్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మత్స్య శాఖ ద్వారా అందే ప్రయోజనాలను వివరించారు.

# ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు

## జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్



**జహీరాబాద్, మే 5 ప్రజాబలం ప్రతినిధి:** ఆయిల్ ఫామ్ సాగుతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం నియోజకవర్గంలోని రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, సి డి సి చైర్మన్ మోబిన్, ఏడిఏ బిక్షపతి, కెవికె శాస్త్రవేత్త స్నేహలత, ఏవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగుకు రైతులకు అనేక రకాల సబ్సిడీలను ఇవ్వటంతో పాటు పంటను కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలో పెద్ద ఎత్తున రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి విట్టల్, ఉద్యాన శాఖ అధికారి, పండరి, వివిధ మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈవోలు, రైతులు, గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులు, డ్రిప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ కి జన్మదిన శుభాకాంక్షలు

## తెలియజేసిన బేరి రామచంద్ర యాదవ్



**హైదరాబాద్‌శేర్లింగంపల్లి (ప్రజాబలం ప్రతినిధి నరేష్)మే 5** మాజీ ఎంపీ, తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్. మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేకంగా సత్కరించారు. పూల మాలలతో, శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ అంజన్ కుమార్ యాదవ్ మంచి పదవులు చేపట్టి బీసీలకు, ఎస్సీ, ఎస్టీలకు మరింత సహాయ సహకారం అందించాలని కోరారు. పేద బడుగు బలహీన వర్గాలకు సేవలు అందించాలన్నారు.

# సాంఘిక శాస్త్రంలో నూటికి నూరు మార్కులు

## సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం

### ముఖ్యఅతిథిగా డీవో రమేష్ కుమార్

**నాగర్ కర్నూల్ ప్రజాబలం ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని గవర్నమెంట్ హైస్కూల్లో ఈరోజు అభినందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సోషల్ ఫోరం మరియు క్లాస్ మెట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి సాంఘిక శాస్త్రం (సోషల్) సబ్జెక్టులో నూటికి నూరు మార్కులు సాధించిన 21 మంది విద్యార్థులను ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా డా. ప్రఫుల్ చంద్రా రెడ్డి, డా. రమేష్ చంద్ర, తిరుమల ఎలక్ట్రికల్ సంస్థకు చెందిన టి. జనార్ధన్, ఎన్ఆర్ఐ కె. జ్యోతి కిశోర్‌ల సహకారంతో ప్రతి విద్యార్థికి రూ. 1,116 నగదు పురస్కారం అందజేశారు. అలాగే విద్యార్థులను ఉత్తమ ఫలితాలకు దారితీసిన సోషల్ టీచర్‌ను ప్రత్యేకంగా సన్మానించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ ఏ. రమేష్ కుమార్ విద్యార్థులను అభినందిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు



కృషి, పట్టుదలతో ముందుకు సాగితే అత్యుత్తమ ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఫౌండర్ వాస రాఘవేంద్ర రాఘవేందర్, జిల్లా సోషల్ ఫోరం అధ్యక్షుడు కృష్ణమోహన్, ప్రతినిధులు సువర్ణ, కెపీ ప్రసాద్, చంద్రశేఖర్, రాములు, నిరంజన్, ఎల్. వేణుగౌడ్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి మే 5** ఆదర్శ్‌నగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మాజీ ఎంపీ, తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన సీటీ కాంగ్రెస్ సెక్రటరీ ఎస్.ధన్‌రాజ్,మాజీ మార్కెట్ డైరెక్టర్ టీ.సతీష్

# రంజోల్ లో వివాహిత అదృశ్యం

**జహీరాబాద్, మే 5 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ మునిసిపల్ పరిధిలోని రంజోల్ గ్రామంలో వివాహిత అదృశ్యమైనట్లు జహీరాబాద్ రూరల్ ఎస్సై కాశీనాథ్ పేర్కొన్నారు. గ్రామానికి చెందిన చాకలి అనిత అనే మహిళ ఈనెల రెండున ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదని, బంధువుల వద్ద స్నేహితుల వద్ద వెతికిన ఆచూకీ లభ్యం కాలేదని ఆమె భర్త శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సేవలడించారు. ఎవరికైనా మహిళా ఆచూకీ తెలిస్తే జహీరాబాద్ రూరల్ పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

# చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

వాల్మీకిపురం చైన్ స్నాచింగ్ తో మహిళల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను అన్నమయ్య జిల్లా పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఎస్పీ ధీరజ్ నిందితుల అరెస్టు వివరాలు మంగళవారం మదనపల్లెలో వివరించారు. వాల్మీకిపురం ఏటిగడ్డ శివాలయం వద్ద అనుమానస్పదంగా ఉంటూ, చైన్ స్నాచింగ్ కు పాల్పడే మహిళలతో కూడిన ఐదుగురు సభ్యుల ముఠాను సీఐ రాఘవరెడ్డి సిబ్బందితో వెళ్లి పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.11,62,500 విలువైన 77గ్రాముల బంగారు ఆభరణాలు, 4 సెల్ ఫోన్లు, 2బైకులను సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు..

# బుధవారం కొండాయి, చిన్నబోయినపల్లి గ్రామాల్లో ప్రజా దర్బార్ కార్యక్రమం

## జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్. జి




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 05 2026 ఏటూరు నాగారం** రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఆదేశాల మేరకు

ఏటూరునాగారం మండలంలోని కొండాయి గ్రామంలోని ఏ యు పి ఎస్ పాఠశాలలో బుధవారం ఉదయం 8:00 గంటలకు, చిన్నబోయినపల్లి గ్రామంలోని ఏ హెచ్ ఎస్ పాఠశాలలో ఉదయం 10:00 గంటలకు రాష్ట్ర పంచాయతీరాజ్, మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో ఏటూరునాగారం మండలంలోని కొండాయి, చిన్నబోయినపల్లి గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, రెండు గ్రామాల పరిధిలోని ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు.

ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జిల్లా ఎస్పీ, డీఎఫ్ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

# ఏటూరునాగారం సామాజిక ప్రభుత్వ హాస్పటల్ ను సందర్శించిన ములుగు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగా కళ్యాణి



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 0 5 2026 ఏటూరు నాగారం** ఏటూరునాగారం సామాజిక వైద్యశాలను మంగళవారం. ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి అకస్మిక తనిఖీ చేశారు హాస్పిటల్ కి సంబంధించిన వైద్యుల రిజిస్టర్ అలాగే పరిశీలించి వైద్యులు ఎంతమంది హాజరవుతున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు హాస్పిటల్లో నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకుని మంత్రిగారి దృష్టికి తీసుకెళ్తామని వైద్యులకు తెలియజేశారు హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటున్న రోగుల వద్దకు వెళ్లి హాస్పిటల్లో అందుతున్న చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు డాక్టర్ ఉత్తంకుమార్ డాక్టర్ రాకేష్ మౌనిక వైద్యులు ఆసుపత్రిలో సమస్యలు తెలియజేస్తూ మరింత ఆసుపత్రికి సదుపాయాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు

ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకన్న జిల్లా ప్రధాన కార్యదర్శి గుండ్ల దేవేందర్ మండల అధ్యక్షుడు చిటమట రఘు జిల్లా సెక్రెటరీ ఎండి ఖలీల్ ఆత్మ చైర్మన్ కర్ల అరుణ రామన్నగూడెం సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు

లి ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న,జిల్లా ప్రధాన కార్యదర్శి గుండ్ల దేవేందర్,మండల మాజీ అధ్యక్షుడు చిటమట రఘు,జిల్లా సెక్రటరీ ఎండి ఖలీల్ ఖాన్,ఆత్మ చైర్మన్ కర్ల అరుణ,మండల ఉపాధ్యక్షులు ౮ జుఖుఎం వైస్ చైర్మన్ చెన్నూరు బాలరాజు,బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ౮ వార్డ్ మెంబెర్ వావిలాల నర్సింహారావు,మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య,మాజీ ఎంపీటీసీ కోడి వేణు గోపాల్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శీను,ఆత్మ కమిటీ చైర్మన్ కర్ల అరుణ, ఆత్మ కమిటీ డైరెక్టర్ సయ్యద్ ముస్తఫా,మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్ది రాజబాబు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు గీకూరు భాగ్య, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి వీఎ గౌస్ పాషా,జిల్లా యూత్ ఉపాధ్యక్షులు సర్వ అక్షిత్,రామన్నగూడెం సర్పంచ్ గద్దల నవీన్, చేల వినయ్,టౌన్ యూత్ అధ్యక్షులు బందారి లక్ష్మణ్,మండల మైనార్టీ సెల్ అధ్యక్షులువీఎ సిరాజ్,వార్డ్ మెంబర్ ఉమ్మనేని రమేష్,టౌన్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్ల తరుణ్,వార్డ్ మెంబర్ నగవత్ కిరణ్,కె రంజిత్,గంపల శివకుమార్,పోలబోయిన గోపాల్, పడిదల హనుమంతు,పాగా నాగరాజ,మంజుల, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు..

# అందోల్--జోగిపేట అభివృద్ధికి 15 కోట్ల భారీ నిధులు మంత్రి దామోదర్ రాజనరసింహ ప్రత్యేక కృషి ఫలితం



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మే 05 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్ల** :మంత్రి దామోదర్ రాజనరసింహ )అందోల్--జోగిపేట,మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణంలో పారిశుధ్యం, రహదారులు, పార్కులు, కమ్యూనిటీ హాల్స్,అభివృద్ధి వంటి అంశాలలో సమగ్ర ప్రణాళికతో ముందుకు తీసుకెళ్తున్నారు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా, దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి ఈ నిధులను సాధించారు మంజూరైన పనులు ౮ అంచనా వ్యయం:

1. బహదూర్ ఖాన్ మల్టీపర్పస్ హాల్ నిర్మాణం -- ?3.00 కోట్లు
2. మహిళా శక్తి భవనం నిర్మాణం -- ?1.50 కోట్లు
3.మదీనా కమ్యూనిటీ హాల్ అభివృద్ధి ౮ మరమ్మత్తులు -- ?0.49 కోట్లు
4. బాబా నగర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధిమరమ్మత్తులు -- ?0.49 కోట్లు
5.వివేకానంద పార్క్ సుందరీకరణ --?2.00 కోట్లు
6. అందోల్ చెరువు కాలుష్య నివారణకు యు జి డి పైప్‌లైన్ ( గౌని నుండి ఫైర్ స్టేషన్ వరకు) -- ?2.00 కోట్లు
7. 2BHK కుమ్మరి గూడెం నుండి సాయిబన్సేట్ రోడ్ వరకు యూజీడీ పైప్‌లైన్ -- ?1.52 కోట్లు
8.స్వాగత ఆర్చ్‌ల ఏర్పాటు -- ?2.00 కోట్లు
9.పొసానిపేట్ పిడబ్ల్యుడి రోడ్ నుండి ఆర్ ఆర్ డిస్టిలేషన్ కంపెనీ వరకు జజ రోడ్ -- ?2.00 కోట్లు

మొత్తం -- ?15.00 కోట్లు,అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్న ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనరసింహ గారికి ఆందోల్ -జోగిపేట పట్టణ ప్రజలు మంత్రికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు...

# మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అమ్మ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి మే 5 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మాజీ మంత్రివర్యులు సబితా ఇంద్రారెడ్డి అమ్మ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ మర్పల్లి మండల పార్టీ అధ్యక్షులు రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు

# దళిత క్రైస్తవుల సన్నాక సదస్సును విజయవంతం చేయాలి. పాస్టర్ల అసోసియేషన్ పిలుపు.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండల కేంద్రంలోని సత్యపాల్ పెయిట్ ప్రేయర్ హౌస్ లో మంగళవారం వేములవాడ నియోజకవర్గం క్రిస్టియన్ పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన జిల్లా క్రిస్టియన్ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు బోలుమల్ల జీవన్ (ఇండియా) మాట్లాడుతూ దళిత క్రైస్తవ రిజర్వేషన్ అంశంపై సుప్రీంకోర్టు విలువరించిన తీర్పును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. 1950 నాటి పాత రాష్ట్రపతి ఉత్తర్వులను ప్రాతిపదికగా తీసుకొని తీర్పు ఇవ్వడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈనెల 12/05/2026 న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిర్వహించనున్న దళిత క్రైస్తవుల సన్నాక సదస్సుకు మందకృష్ణ మాదిగ విచ్చేస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని వేములవాడ నియోజకవర్గంలోని పాస్టర్లు అందరు కలిసికట్టుగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దళిత క్రైస్తవుల కుల సాధన కోసం జరిగే ఈ పోరాటంలో అందరు భాగస్వాములు కావాలని కోరారు. ఈ పత్రిక సమావేశంలో జిల్లా జాయింట్ సెక్రెటరీ సుంకే జోసెఫ్ పాల్, వేములవాడ మండల అధ్యక్షులు ప్రసాద్, ఉపాధ్యక్షులు గోగులకొండ ఆహా రోన్ ప్రధాన కార్యదర్శి నేదూరి ఏసుపాలు, సహాయ కార్యదర్శి బైరిక్రీస్తు దాసు, కోశాధికారి తంగేళ్ల సత్యపాల్, జిల్లా స్టీరింగ్ కమిటీ మెంబర్ చిట్యాల రాజు, ఇల్లంతకుంట మండల అధ్యక్షులు దొబ్బల యేసుదాసు పాల్గొన్నారు. వీరితోపాటు తాళ్లపల్లి ఇరిమియా, ప్రసంగి, ఓసారి ప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు దొబ్బల మోజేష్ పాస్టర్, సముద్రాల డేవిడ్ రాజు, జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పని వారికి మో బలైజేషన్ చేయాలి ప్రత్యేక సమావేశంలో ఎంపీడీవో, ఏపీ ఓ



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి మే 5 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం లో ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ కూలీలకు ప్రత్యేకశీగా మొబిలైజేషన్ చేసే బాధ్యత మన అందరి పైన ఉందని మర్పల్లి ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు ముఖ్యంగా గ్రామాల్లో గ్రామ ప్రథమ పౌరులు గ్రామ సర్పంచ్ మరియు గ్రామ సెక్రెటరీ మరియు టిఏ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతి ఒక్కరూ ఉపాధి హామీలో పనివారు అధిక సంఖ్యలో పనిచేయాలంటే జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి మొబిలైజేషన్ చేసి వారికి ప్రభుత్వం కలి పించిన పని దినములు వారు సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ ,ఏపీఓ అంజిరెడ్డి ,తెలిపారు ముఖ్యంగా ఎండలు మెండుగా ఉన్నాయి కాబట్టి ఉపాధి హామీ పని వారందరూ ఉదయం త్వరగా వెళ్లి పని ప్రదేశంలో పనిచేస్తూ కొద్ది సమయం విశ్రాంతి తీసుకొని మరలా పనిచేసి మంచినీళ్లు తాగి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పని ముగించుకుని త్వరగా ఎండ దెబ్బ తగలకుండా ఇంటికి వచ్చేలా ప్లాన్ చేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ ,ఏపీఓ అంజిరెడ్డి ,హౌసింగ్ ఏఈ ,వివిధ గ్రామాల సర్పంచులు వివిధ గ్రామాల సెక్రటరీలు వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు కార్యక్రమం పాల్గొని విజయవంతం చేసినట్టు తెలిపారు



# వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో కో - ఆప్షన్ సభ్యుల ఏకగ్రీవ ఎన్నిక. ఎన్నిక ప్రక్రియలో పాల్గొన్న ప్రభుత్వ విప్.






**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ కో -ఆప్షన్ సభ్యులను మంగళవారం రోజున ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

4 కో- ఆప్షన్ సభ్యుల స్థానాలకు గాను కట్కూరి శ్రీనివాస్, పీర్ మమ్మద్ దుర్గం విజయ-పరశు రాములు, తుమ్మ జ్యోతి-చిన్నారెడ్డి లను కో ఆప్షన్ సభ్యులుగా ఎంపిక చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రక్రియకు వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు ప్రభుత్వ విప్ శు భాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న సీనియర్ నాయకులకు మరియు పార్టీ శ్రేణులకు ప్రాధాన్యత కల్పిస్తూ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల స్థానిక నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపికైన సభ్యులందరికీ పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలుపుతూ మీరు నియామకం ద్వారా వేములవాడ మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com